https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సార్థ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 317 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ ఆదివారం, సెప్టెంబర్,20, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

### ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల సర్వేలో మరో మలుపు..

# సోమవారం నోటీసులు!



**హైదరాబాద్,సెప్టెంబర్,19:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి భూముల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఎర్రవల్లిలోని 325 సర్వే నంబర్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు అధికారులు వరుసగా మూడో రోజు సర్వే కొనసాగించారు. శనివారం రెవెన్యూ, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ అధికారులు భూములను పరిశీలించారు. అయితే ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల సర్వే తాజాగా మరో మలుపు తిరిగింది. 325 సర్వే నంబర్‌లోని 388 ఎకరాల్లో 180 ఎకరాలు తమ గ్రామానికి చెందినవేనని వెంకటాపూర్ గ్రామస్థులు ఆరోపించడం హాట్ టాపిక్?గా మారింది. వెంకటాపూర్, వరదరాజుపూర్, ఎర్రవల్లి గ్రామాల పరిధిలో ఉన్న 325 సర్వే నంబర్?లోని మొత్తం 388 ఎకరాల భూముల్లో 250 ఎకరాలు మాత్రమే ఎర్రవల్లి గ్రామానికి చెందినవని.. మిగతా 180 ఎకరాలు వెంకటాపూర్ గ్రామానికి చెందినవని చెబుతున్నారు. 80 ఎకరాలను గతంలో బలవంతంగా ఎర్రవల్లి గ్రామానికి సంబంధించిన సర్వే నంబర్‌గా చూపించారని ఆరోపించారు. అధికారులు చేసిన ఈ తప్పిదం వల్ల తాము నష్టపోవాల్సి వస్తోందని అందువల్ల ఖాస్రా, సేత్వార్ రికార్డుల ప్రకారం సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 325 సర్వే నంబర్ నుంచి తమ భూములను తొలగించి, వెంకటాపూర్ గ్రామానికి చెందిన భూములుగా పరిగణించాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సంబంధించిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ ఇప్పటికే రాజకీయంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. వెంకటాపూర్ గ్రామస్తులు కొత్త డిమాండ్ తెరమీదకు తీసుకురావడంతో ఈ అంశం ఎలాంటి మలుపు తిరుగుతుందో చూడాలి. 325లోని ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించేందుకు ఇవాళ 3 బృందాలుగా సర్వే కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇవాళ సాయంత్రం వరకు ఈ సర్వే పూర్తయ్యే అవకాశం ఉందని, సంబధిత రైతులకు ఇచ్చేందుకు తహశీల్దార్ కార్యాలయంలో నోటీసులు సిద్ధం చేస్తున్నారని ఇవాళ సాయంత్రం లేదా సోమవారం నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు.

### భారత యువత సత్తాకు

# స్టార్టప్‌లే నిదర్శనం: ప్రధాని మోదీ

**- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ-చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని-రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం-కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,19:** దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ..

"భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

# దానం నాగేందర్ విషయంలో స్పీకర్ మౌనం!



**హైదరాబాద్,సెప్టెంబర్,19:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో తెలంగాణ రాజకీయాలు తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. హైకోర్టు తీర్పు అనంతరం ఈ అంశంపై స్పందించేందుకు సభాపతి (స్పీకర్) గడ్డం ప్రసాద్ కుమార్ నిరాకరించారు. శనివారం సూర్యాపేట జిల్లా కోదాడలో నిర్వహించిన 'మెగా జాబ్ మేళా' కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా దానం నాగేందర్ అనర్హత పిటిషన్లు, హైకోర్టు తీర్పుపై మీడియా ప్రతినిధులు ఆయనను ప్రశ్నించగా.. మాట్లాడేందుకు స్పీకర్ నిరాకరించారు. ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా మౌనంగా దాటవేశారు. మరోవైపు తన అనర్హత వ్యవహారంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. ఈ తీర్పుపై తాను సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వస్తే పోటీకి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటన చేశారు. ఈ పరిణామాలతో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నికల వేడి ఒక్కసారిగా రాజుకుంది. స్పీకర్ నిర్ణయం ఎలా ఉండబోతోంది, కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్తుందనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

### విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం'..

## లబ్ధిదారులకు ఆస్తి హక్కు పత్రాలు అందించిన సీఎం చంద్రబాబు



విశాఖ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల పట్టాలను (ఆస్తి హక్కు పత్రాలు) ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని 28,445 కుటుంబాలకు వారి సొంతింటి కల సాకారమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్ల స్థలాల కోసం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. ఈ క్రమబద్ధీకరించిన స్థలాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పంపిణీ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ. 8,874 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమం నగరంలో పండగ వాతావరణాన్ని తలపించింది. అంతకుముందు, ఇవాళ విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం చంద్రబాబు లబ్ధిదారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ఆయన లబ్ధిదారులను, సభకు హాజరైన వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాటు పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. దశాబ్దాలుగా ఉన్న తమ సమస్యకు పరిష్కారం లభించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

### ఖైరతాబాద్ ఉపఎన్నిక:

# కాంగ్రెస్ అభ్యర్థిపై మహేశ్ గౌడ్ క్లారిటీ




**హైదరాబాద్,సెప్టెంబర్,19:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్వాగతించారు. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి కాదని, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి లభించిన తీవ్ర చెంపపెట్టని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, దానం నాగేందర్ వ్యవహారం, తెలంగాణలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలపై స్పష్టత ఇచ్చారు. దానం నాగేందర్ వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును తాము పూర్తిగా స్వాగతిస్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి పార్టీ ఫిరాయింపులు జరగలేదని స్పష్టం చేశారు. కేవలం కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న ప్రజాపాలనకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మాత్రమే ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో మళ్లీ దానం నాగేందర్ పోటీ చేస్తారా లేదా అన్నది కాంగ్రెస్ పార్టీ అధిష్టానం (హైకమాండ్) పరిశీలించి నిర్ణయిస్తుందని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల సంస్కృతిని తెలంగాణలో ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలను ఏ విధంగా కొనుగోలు చేసే తమ పార్టీలో విలీనం చేసుకున్నారో ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని గుర్తుచేశారు. అటువంటి అక్రమాలకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రాజ్యాంగబద్ధంగా, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, ఉప ఎన్నికలలో ప్రజా తీర్పు మళ్లీ తమకే అనుకూలంగా ఉంటుందని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

### తీవ్ర అనారోగ్యానికి గురైన అమిత్ షా..

# మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి గైర్హాజరు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,19:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో కర్ణాటకలోని హుబ్బళ్లిలో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గైర్హాజరైనట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. వైద్యుల సూచనల మేరకు ఆయన హోటల్ కే పరిమితమయ్యారు. గబ్బూర్ పరిధిలోని 'కెఎల్ఇ జగద్గురు గంగాధర మహాస్వామిగళు మూరుసావిరమఠ్' వైద్య కళాశాల నూతన అకాడమిక్ భవనంతో పాటు, 1,200 పడకల కెఎల్ఇ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించేందుకు ఆయన రావలసి ఉంది. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి కెఎల్ఇ సొసైటీ ఛైర్మన్, మాజీ రాజ్యసభ ఎంపీ ప్రభాకర్ కోరే మాట్లాడుతూ.. "ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వైద్యుల సలహా మేరకు ఆయన హోటల్ గదిలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయాన్ని మీకు తెలియజేయాల్సిందిగా ఆయన నన్ను కోరారు" అని వెల్లడించారు. అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్య విభాగాధిపతి శరణ్ ప్రకాష్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, బెళగావి ఎంపీ జగదీష్ శెట్టర్, శ్రీ జగద్గురు మూరుసావిరమఠానికి చెందిన శ్రీ గురుసిద్ధ రాజయోగీంద్ర స్వామి సంయుక్తంగా ఈ వైద్య సంస్థలను ప్రారంభించారు.

# కారు కాలువలో పడి ఎనిమిది మంది మృతి



మధ్యప్రదేశ్: అదుపుతప్పి సమీపంలోని లోతైన మురుగు కాలువలోకి (డ్రైన్) దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘోర దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ సంఘటన మధ్యప్రదేశ్‌లోని అగర్ మాల్వా జిల్లాలో శనివారం అత్యంత విషాదకరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక పోలీసు ఉన్నతాధికారులు ప్రకారం.. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో పలువురు ప్రయాణికులు ఉండగా, నీటి ప్రవాహం, బురద కారణంగా కారు నుంచి బయటకు రాలేక ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం, పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు (రెస్క్యూ ఆపరేషన్) చేపట్టాయి. స్థానికుల సహకారంతో క్రేన్లు, ప్రత్యేక పరికరాల సాయంతో కాలువలో మునిగిపోయిన కారును వెలికితీసి, మృతదేహాలను వెలికి తీసే ప్రక్రియను ముమ్మరం చేశారు. వాహనంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతుల పూర్తి వివరాలను సేకరిస్తూ, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.

# గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి డీసీపీ ఎ.భాస్కర్.....
## పోచమ్మ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ...



బెల్లంపల్లి(డీకే చాటింపు )పట్టణం మరియు పరిసర ప్రాంతాలకు చెందిన వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే పోచమ్మ చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, మున్సిపల్ చైర్పర్సన్ స్వాతిరమేష్,సబ్ కలెక్టర్, మనోజ్,తహసీల్దార్, మున్సిపల్,పోలీస్ మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయక విగ్రహాలు వచ్చే మార్గం, నిమజ్జనం అనంతరం బయటకు వెళ్లే మార్గం,పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ నిమజ్జన శోభాయాత్ర సజావుగా సాగేందుకు శోభాయాత్ర మార్గంలో ఉన్న గుంతలను తాత్కాలికంగా పూడ్చి, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. ప్రస్తుతం అవసరమైన తాత్కాలిక ఏర్పాట్లు చేపడుతున్నారని, సబ్ కలెక్టర్ కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.నిమజ్జన ప్రాంతంలో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులో డ్రెడ్జింగ్ ద్వారా లోతును పెంచడంతో పాటు అవసరమైన ఇతర ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ తరఫున మూడు షిఫ్టుల్లో పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 2,800 వినాయక విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో నిర్వాహకులు, ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన చెరువులు, నిమజ్జన పాయింట్ల వద్ద చిన్నపిల్లలు, వృద్ధులు,ఈత రాని వ్యక్తులు నీటి వద్దకు వెళ్లకుండా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.ప్రధాన నిమజ్జన పాయింట్ల వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్ల ఎత్తును ముందుగానే పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు బెల్లంపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ హనోక్ ,బెల్లంపల్లి టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు,ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉన్న ఎమ్మెల్యే




గోదావరిఖని:శివాజీ నగర్ వస్త్ర వ్యాపారుల మరియు బుక్క దుకాణాల, ఫ్లవర్ మర్చంట్ దారుల పత్రికా సమావేశం శివాజీ నగర్ మున్సిపల్ కాంప్లెక్స్ లో గోదావరిఖని పట్టణ ప్రాంతంలోని శివాజీ నగర్‌కు చెందిన బట్టల వ్యాపారస్తులు ఈరోజు ఒక ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ తమకు అందించిన అభివృద్ధి, సహకారం, అలాగే ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన విధానాన్ని ప్రశంసించారు. వ్యాపారస్తులు మాట్లాడుతూ - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఎప్పుడూ, ఎవరికీ, ఎలాంటి అన్యాయం చేయలేదని స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా శివాజీ నగర్ ప్రాంతంలో రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి కోసం తమ షాపులు తొలగించాల్సి వచ్చినప్పటికీ, తమ జీవనాధారాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాకు పూర్తి న్యాయం చేశారని తెలిపారు. షాపులు తొలగించిన వెంటనే వ్యాపారస్తులు ఇబ్బందులు పడకుండా, షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయించి మమ్మల్ని ఆదుకున్నారని, ఇది ఆయన ప్రజాప్రతినిధిగా చూపిన బాధ్యతాయుతమైన నాయకత్వానికి నిదర్శనమని వారు అన్నారు. అభివృద్ధి జరుగుతున్నా ప్రజల ఉపాధి దెబ్బతినకూడదన్న దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే పనిచేస్తున్నారని కొనియాడారు. అలాగే గోదావరిఖని పట్టణంలోని ప్రతి ఒక్క వ్యాపారస్తుడికి అండగా నిలుస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముందుంటారని వ్యాపారస్తులు స్పష్టంగా పేర్కొన్నారు. వ్యాపార వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే ప్రతి మంచి నిర్ణయంలో ఎమ్మెల్యే పాత్ర కీలకమని తెలిపారు.ఈ సందర్భంగా శివాజీ నగర్ బట్టల వ్యాపారస్తులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాగే ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధిని కొనసాగించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమం లో బట్టల శివాజీ నగర్ బట్టల వ్యాపార సంఘం అధ్యక్షులు నమని సదయ్య, వంగ దేవేందర్, పి అంజయ్య, బూర్ల సతీష్, గోలి రంగన్న, ఆడెపు శెంకర్, ఎం రాజమల్లు, ఎం రమేష్, వంగ నవీన్, గజర్ల అరుణ్, కె సంపత్, టీ రాజమౌళి, మురళి, రాజమౌళి, సత్యం, ఎం శ్రీనివాస్, గట్టయ్య, బుక్క దుకాణ అధ్యక్షులు చింతల సదానందం ఫ్లవర్ మర్చంట్ అసోసియేషన్ మెంబర్ సతీష్ తదితరులుపాల్గొన్నారు.

# ఆరెంజ్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్లో మహా అన్న ప్రసాద వితరణ..డాక్టర్లు ఈగ లక్ష్మణ్ కుమార్,రోహిణి మురికి



హనుమకొండ సెప్టెంబర్ 19 డీకే చాటింపు హనుమకొండ కాకాజి కాలనీ రోడ్డు లోని పాత విజయ థియేటర్ ప్రాంగణంలో నూతనంగా డాక్టర్లు ఎండో క్రైనాలజిస్ట్ ఈగ లక్ష్మణ్ కుమార్,గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ రోహిణి మురికిఏర్పాటు చేసిన ఆరెంజ్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్లో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 6వ రోజు మహా అన్నదాన వితరణ కార్యక్రమం శనివారం అట్టహాసంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గణపతికి విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు డాక్టర్లు ఈగ లక్ష్మణ్ కుమార్,రోహిణి మురికి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలోని ప్రజలకు,కాకాజీ కాలనీ వాసులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని, హిందూ సాంప్రదాయ పద్ధతిలో అన్ని రకాల పండుగలను హాస్పిటల్ లో జరుపుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది ఇంచార్జి శ్రావణ్ రెడ్డి,కళ్యాణ్ గౌడ్,సిబ్బంది పాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నిషియన్ల పోస్టులలో నకిలీలు?



హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు చేపట్టిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ల ద్వారా అనర్హులు వెయిటేజీ మార్కులు పొంది, అర్హులైన అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతేడాది సెప్టెంబర్ 11న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 100 మార్కులలో 80 మార్కులు రాత పరీక్షకు.. మిగిలిన 20 మార్కులు ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారికి వెయిటేజీగా కేటాయించారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రతి ఆరు నెలలకు 2.5 పాయింట్లు, ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారికి 2 పాయింట్ల చొప్పున గరిష్టంగా 20 పాయింట్లు ఇస్తారు. అభ్యర్థి గతంలో ఖచ్చితంగా 'ల్యాబ్ టెక్నీషియన్' హోదాలోనే ప్రభుత్వ ఆస్పత్రులు లేదా విభాగాల్లో పనిచేసి ఉండాలి. వేరే ఇతర హోదాల్లో పనిచేసిన వారికిఈ వెయిటేజీ వర్తించదు. ఈ నెల 20 నుండి 22 వరకు జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియలో అసలు అక్రమాలు బయటపడ్డాయి. ఏడు జోన్ల పరిధిలో (చార్మినార్, జోగులాంబ, యాదాద్రి, రాజన్న, భద్రాద్రి, బాసర, కాళేశ్వరం) అభ్యర్థుల జాబితాను పరిశీలించిన బాధితులుగ్రాఫ్ఞంతికి గురయ్యారు.

# బెల్లంపల్లి 1 టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన మంచిర్యాల డీసీపీ....




బెల్లంపల్లి (డీకే చాటింపు )ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ సూచించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బెల్లంపల్లి 1 టౌన్ పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు,పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు, శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించారు.కేసులకు సంబంధించిన వివరాలను సీసీటీఎన్ఎస్‌లో సకాలంలో నమోదు చేయాలని,కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను డిజిటల్ రూపంలో అప్‌లోడ్ చేయాలని సీఐకి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజలకు సత్వర, పారదర్శక,నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.మహిళలు,చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని,పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 1టౌన్ సీఐ శ్రీనివాస్ రావు,సిబ్బంది పాల్గొన్నారు

# రహస్య జీవోల సంగతేంటీ

హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉత్తర్వుల గోప్యతపై హైకోర్టు మరోసారి సీరియస్ అయ్యింది. అన్ని జీవోలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు తెలియాల్సిన నిర్ణయాలను దాచిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టకుండా దాచిపెట్టే సంప్రదాయం మాత్రం మారడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ బ్లాంక్ నంబర్ల సంస్కృతి, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనూ కొనసాగుతుండటం పారదర్శకతపై పెద్ద ప్రశ్నగా మిగిలింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవోల గోప్యత గరిష్ట స్థాయికి చేరిందని చెప్పవచ్చు. ముఖ్యంగా భూ కేటాయింపులు, నిధుల మళ్లింపు, వివాదాస్పద నిర్ణయాలకు సంబంధించిన వేలాది జీవోలను ఆన్‌లైన్ లో అందుబాటులో ఉంచకుండా 'కాన్ఫిడెన్షియల్' కేటగిరీలో దాచేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఇది చీకటి పాలన అని, తాము అధికారంలోకి వస్తే ప్రతి జీవోను ప్రజల ముందు ఉంచుతామని హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరీ ఆశాజనకంగా ఏమీ లేదని గణాంకాలు చెబుతున్నాయి.తాజా గణాంకాల ప్రకారం, గత 13 నెలల్లో విడుదలైన 19,000 పైచిలుకు జీవోలలో కేవలం 17-18 శాతం మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు 82 శాతం జీవోలు ఇంకా రహస్య ఫోల్డర్లలోనే మగ్గుతున్నాయి. గత ప్రభుత్వంలో 50-60 శాతం దాచిపెట్టేవారని అనుకుంటే, ప్రస్తుత గణాంకాలు అంతకంటే ఎక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. బదిలీలు, ఆర్థిక వ్యయం వంటి అంశాలను ప్రజల కంట పడకుండా ఉంచేందుకు రహస్య జీవోల అస్త్రాన్ని ప్రభుత్వాలు వాడుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 ప్రకారం, ప్రభుత్వాలు తమ నిర్ణయాలను స్వచ్ఛందంగా బహిర్గతం చేయాలి. కానీ తెలంగాణలో మాత్రం జీవో కాపీ కావాలంటే కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ప్రజా ధనం, ప్రజా ప్రయోజనం ముడిపడి ఉంటాయి. అటువంటప్పుడు ఆ నిర్ణయాలను దాచాల్సిన అవసరం ఏమిటి అనే ప్రశ్న సామాన్యుడిలో ఉదయిస్తోంది. పారదర్శకత అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోతుందా అని పౌర సమాజం నిలదీస్తోందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనైనా ప్రస్తుత ప్రభుత్వం తన తీరు మార్చుకుంటుందా అనేది వేచి చూడాలి. గత ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ అధికారంలోకి వచ్చిన వారు, అవే తప్పులను కొనసాగించడం అంటే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమే అవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరి ప్రభుత్వం అన్నింటినీ పబ్లిక్ కు అందుబాటులో ఉంచుతుందా?

# అట్టహాసంగా అభయ హాస్పిటల్లో మహా అన్న ప్రసాద వితరణ..వైద్యం రాజగోపాల్ వెల్లడి




హనుమకొండ సెప్టెంబర్ 19 డీకే చాటింపుహనుమకొండ కాకాజి కాలనీ రోడ్డులోని అభయ హాస్పిటల్లో డాక్టర్లు ఎండీ జనరల్ ఫీజిషియన్ వైద్యం గౌతమ్, ఎండీ జనరల్ సర్జన్ ఉమెన్ కేర్ వైష్ణవి మన్న అభయ హాస్పిటల్ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 6వ రోజు మహా అన్నదాన వితరణ కార్యక్రమం దాతలు దూడపాక గణేష్, దూడపాక గౌతమ్ సహకారంతో శనివారం అట్టహాసంగా నిర్వహించారని హనుమకొండ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వైద్యం రాజగోపాల్ మీడియాకు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గణపతికి విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు డాక్టర్లువైద్యం గౌతమ్,వైష్ణవి మన్నతెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలోని ప్రజలకు,కాకాజీ కాలనీ వాసులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని, హిందూ సాంప్రదాయ పద్ధతిలో అన్ని రకాల పండుగలను అభయ హాస్పిటల్ లో జరుపుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది కలుగూరి మణి చంద్,బర్ల అరుణ్,సాయి ప్రణీత్, బొచ్చు చందు,ప్రిన్స్,చరణ్, విజయ్,ప్రవీణ్, నవీన్, శ్రావణ్, జయ,సువర్ణ, కావ్య పాల్గొన్నారు.

# మేకపాటి స్థానంలో కొత్త నేత

నెల్లూరు, : జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా చాలా కుటుంబాలు అండగా నిలిచాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం నేతలు తమ సొంత పార్టీలను వదిలి జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కానీ ఆ పార్టీలో అనుకున్న స్థాయిలో గుర్తింపు సాధించుకోలేకపోయారు. దీంతో ఒక్కొక్కరు బయటకు వెళ్ళిపోయారు. ఇప్పుడు మరో పొలిటికల్ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అటు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫ్యామిలీని లైట్ తీసుకోవడంతో ఇక పార్టీలో ఉండడం భావ్యం కాదని భావిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతను బరిలోదించేందుకు అప్పుడే అన్వేషణ ప్రారంభించారట జగన్మోహన్ రెడ్డి. దీంతో ఆ ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు పరిమితమైంది. ఎన్నికల ముంగిట ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది.కాంగ్రెస్ పార్టీని విభేదించి జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి ఫ్యామిలీ చేరింది. మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్. 1989 నుంచి ఆయన ఎంపీ గానే పోటీ చేస్తూ గెలుస్తూ వచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఎంపీ పదవిని వదులుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. 2012 ఉప ఎన్నికల్లో గెలిచారు కూడా. 2014 ఎన్నికల్లో సైతం ఆయనే సత్తా చాటారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి. అయితే 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్నారు. ఆయన బదులు కుమారుడు గౌతమ్ రెడ్డి రంగంలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహిత నేత గౌతమ్ రెడ్డి. ఆయన వల్లే ఆ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2019 ఎన్నికల్లో గౌతంరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అయితే 2022లో చనిపోయారు గౌతమ్ రెడ్డి. ఆయన స్థానంలో తమ్ముడు విక్రమ్ రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ జగన్ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అప్పటినుంచి మేకపాటి ఫ్యామిలీలో ఒక రకమైన అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది.గత ఎన్నికలకు ముందు మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్ ఇచ్చారు జగన్. అయితే నెల్లూరు జిల్లాలో నేతలంతా బయటకు వెళ్లిపోవడంతోనే జగన్ మేకపాటి ఫ్యామిలీకి రెండో టిక్కెట్ కల్పించారు. కానీ 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రాజమోహన్ రెడ్డి కి ప్రాధాన్యత తగ్గించారు జగన్మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు పై దృష్టి పెట్టింది మేకపాటి ఫ్యామిలీ. ఇటీవల నెల్లూరు వచ్చిన రాజమోహన్ రెడ్డి పార్టీ అధినేత తీరు మార్చుకోవాలని సూచిస్తూ విలువైన సలహాలు ఇచ్చారు. అయితే దీనిని సానుకూలంగా తీసుకోకుండా ప్రతికూలంగా తీసుకున్నట్లు తెలుస్తోంది జగన్మోహన్ రెడ్డి. అందుకే ఆయన స్థానంలో టిడిపిలో ఉన్న ఒక బడా నేతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం టిడిపిలో ఎంపీగా ఉన్న ఓ నేతను నెల్లూరుకు రప్పించి ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అతని కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తానని కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈ పరిస్థితులు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ సీనియర్ నేత దూరమైనట్టే.

# కాపు నేతలకు గాలం

కాకినాడ, : ఏపీలో రాజకీయాలు విచిత్రంగా మారుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటినుంచి పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా గెలవాలని భావిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచి క్యాష్ చేసుకోవాలని చూస్తోంది. సామాజిక వర్గాలను తెరపైకి తెచ్చి మరోసారి విజయం అందుకోవాలని భావిస్తోంది. కానీ అది అంత సులువుగా దక్కేలా లేదు. ఎందుకంటే 2014 నుంచి 2024 వరకు వైసిపి చేపట్టిన ఈ ఫార్ములా ఆ పార్టీకి వర్కౌట్ అయింది. కానీ ఇప్పుడు ఎంత మాత్రం అది సాధ్యమయ్యే అవకాశం లేదు. కుల సమీకరణల ద్వారా రాజకీయం చేస్తామంటే కుదిరే పని కూడా కాదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ను దృష్టిలో పెట్టుకొని కాపు సామాజిక వర్గంపై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గతం మాదిరిగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అనే నినాదం పక్కకు వెళ్లిపోయినట్లు సమాచారం.వాస్తవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంక్ అనేది రెడ్డి సామాజిక వర్గంతో పాటు ఎస్సీ సామాజిక వర్గాలే ఉండేవి. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడడానికి కారణం ఆ రెండు సామాజిక వర్గాలు మాత్రమే. రాయలసీమలో రెడ్డి సామాజిక వర్గ ప్రాబల్యం ఉన్న ప్రాంతం కావడంతో అక్కడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిలబడగలిగింది. ఎస్సీలతో పాటు ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో గెలవగలిగింది వైయస్సార్ కాంగ్రెస్. అయితే 2019 ఎన్నికల్లో ఆ రెండు సామాజిక వర్గాలు స్టాండ్ అయ్యాయి. ఆపై మిగతా సామాజిక వర్గాలు సహకరించాయి. దీంతో అంతులేని, అద్భుత విజయం సొంతం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ 2024 ఎన్నికలు వచ్చేసరికి బీసీ నామస్మరణ చేశారు జగన్మోహన్ రెడ్డి. ఎలాగూ సంప్రదాయ ఓటు బ్యాంకు ఉంటుందని భావించి అలా చేశారు. కానీ రాజకీయంతో పాటు ఆర్థికంగా ఏమాత్రం సహకారం అందకపోవడంతో రెడ్డి సామాజిక వర్గం మౌనం దాల్చింది. ఎస్సీ సామాజిక వర్గ ఓట్లు చీలిపోయి దారుణ పరాజయం ఎదురైంది.ఇప్పుడు కూడా కుల సమీకరణల ద్వారా రాజకీయాలు చేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. పవన్ కళ్యాణ్ వెంట కాపు సామాజిక వర్గం ఉందన్న ఆలోచనతో ముద్రగడ పద్మనాభం, చేగొండి హరి రామ జోగయ్య, వంగవీటి మోహన్ రంగా వంటి కుటుంబాలను ఆకర్షించాలని చూస్తున్నారు. ఇప్పటికే ముద్రగడ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంది. చేగొండి హరి రామ జోగయ్య వైసీపీకి అనుకూలంగా పావులు కదుపుతున్నారు. వంగవీటి మోహన్ రంగా కుమార్తె ఆశ కిరణ్ ను వైసీపీలోకి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే పేరు మోసిన కుటుంబాలు వైసీపీలోకి వస్తే చాలదు. క్షేత్రస్థాయిలో కాపు సామాజిక వర్గంలో ఆశలు చిగురించే ప్రయత్నాలు జరగాలి.

డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక
ఆదివారం, సెప్టెంబర్,20, 2026

# సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీకి ఏమైంది..?

వారంలో ఐదు రోజులు పని.. ఐదు అంకెలకు మించిన జీతం.. బోనస్‌లు.. ఇంక్రిమెంట్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సౌకర్యాలు.. కంపెనీ మారితే చాలు శాలరీ హైక్ అయ్యేది. కనివిని ఎరుగని రేంజ్ లో కనక వర్షం కురిసేది. ఐటి ఇండస్ట్రీలో పనిచేసే ఎంప్లాయి ల గురించి పై ఉపోద్ఘాతం మాదిరిగానే చెప్పుకునేవారు.. అంతేకాదు ఐటీ పరిశ్రమలో పనిచేసే వారికి అమ్మాయిలను ఇవ్వడానికి చాలామంది పోటీపడేవారు. కోరినంత కట్నం.. తగినంత బంగారం.. కావలసినంత పొలాలు ఇచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది.ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడుతున్న పరిస్థితులు.. ఐటీ సేవలకు తగ్గిన గిరాకీ.. ఫలితంగా ఐటి పరిశ్రమ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. పైగా కృత్రిమ మేధ అందుబాటులోకి రావడంతో చాలామంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. గడచిన మూడు సంవత్సరాలుగా ఐటీ పరిశ్రమలో తొలగింపులు తప్ప కొత్త నియామకాలు లేవు. ప్రాంగణ నియామకాలు లేకపోవడంతో చాలామంది నిరుద్యోగులుగా మిగులుతున్నారు. ఒకవేళ నియామకాల ప్రక్రియ జరిగినప్పటికీ ఉద్యోగాలు తక్కువ స్థాయిలో ఉంటున్నాయి. ఇక కోర్ ఇంజనీరింగ్ కు డిమాండ్ తగ్గడంతో చాలామంది సాఫ్ట్వేర్ వైపుకు వస్తున్నారు. దీంతో కోర్సులు చదివేవారు పెరిగిపోతున్నారు. ఉద్యోగాలు వారికి తగ్గట్టుగా లేకపోవడంతో నిరుద్యోగం పెరిగిపోతుంది. ఉద్యోగాల కల్పనలో అంతరం వల్ల యువతలో నిరాశ కనిపిస్తోంది.మూడు సంవత్సరాలుగా ఐటీ ఇండస్ట్రీ తిరోగమనాన్ని ఎదుర్కొంటున్నది. ఇదే అదునుగా కంపెనీలు కూడా అడ్డగోలుగా ఉద్యోగాలలో కోతలు విధిస్తున్నాయి. దీంతో చాలామంది ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక మన దేశంలో పేరు పొందిన ఐటీ కంపెనీలు ఉద్యోగాల కోత విధిస్తున్నాయి. తాజాగా టిసిఎస్ కంపెనీ కూడా ఉద్యోగాలలో దారుణమైన కోత విధించింది ఆటోమేషన్ యుగంలో కంపెనీ అవసరాలు తీర్చలేని ఉద్యోగులను మొహమాటం లేకుండా బయటికి పంపించేస్తోంది. సంస్థతో దీర్ఘకాలం అనుబంధం కలిగిన ఉద్యోగులకు మాత్రం రెండు సంవత్సరాల పాటు వేతనాన్ని పరిహారంగా ఇస్తోంది. ఈ ఏడాది జూలై నెల లో దాదాపు 12,000 మందికి ఉద్వాసన పలికింది టీసీఎస్. ఇందులో భాగంగానే వారికి 3 నెలల పాటు నోటీస్ పీరియడ్ ఇస్తోంది. ఆ మూడు నెలలకు కంపెనీ ఉద్యోగులకు వేతనం చెల్లిస్తోంది. దీనికి తోడు అదనంగా ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు పరిహారం ప్యాకేజీ కింద వేతనం చెల్లిస్తోంది. ఎనిమిది నెలలకు మించి బెంచ్ పై ఉండే వారికి సింప్లర్ ప్యాకేజీ అమలు చేస్తోంది. వారికి నోటీస్ పీరియడ్లో ఉన్న వేతనాలు మాత్రమే చెల్లిస్తోంది.సంస్థతో 10 నుంచి 15 సంవత్సరాల అనుబంధం ఉన్న వారు తాజా లే ఆఫ్ లో ఉద్యోగం కోల్పోతే.. వారికి ఏడాదిన్నర పాటు వేతనాన్ని చెల్లిస్తోంది. 15 సంవత్సరాలకు మించి సంస్థతో అనుబంధం ఉన్నవారికి గరిష్టంగా రెండు సంవత్సరాలు పాటు వేదనంగా చెల్లిస్తోంది. అవుట్ ప్లేస్మెంట్ సేవలను కూడా అందిస్తోంది. ఒకవేళ మానసిక ఆరోగ్యం బాగోలేకపోయిన వారికి టిసిఎస్ కేర్ ప్రోగ్రాం కింద చికిత్స లేదా తెరపి అందిస్తోంది. ఒకవేళ రిటర్మెంట్ కు దగ్గర పడిన వారికి ముందస్తు పదవి విరమణకూ అవకాశం కల్పిస్తోంది టిసిఎస్. వీరికి వారి అనుభవాన్ని బట్టి ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు వేతనాన్ని పరిహారం ప్యాకేజీ కింద చెల్లిస్తోంది. అంతేకాదు బీమా సౌకర్యాన్ని కూడా కల్పిస్తోంది.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో పనిచేసే ఉద్యోగులకు కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించడం పరిశ్రమను షాక్ కు గురి చేసింది. అమెరికా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కూడా ఈ ఏడాది ఇప్పటివరకు 15,000 మంది ఉద్యోగులను తొలగించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్ వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ మరింత ఆందోళన కలిగించే విషయం చెప్పింది.రాబోయే రోజుల్లో మరిన్నిలేఆఫ్స్ ఉంటాయని అంచనా వేస్తోంది. దీంతో సాఫ్ట్ వేర్ ఉద్యోగుల భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఆర్టిఫీ షియల్ ఇంటెలిజెన్స్ఆటోమేషన్ కారణంగా టెక్ ఇండస్ట్రీలో భారీ మార్పులు వస్తున్నట్లు నాస్కామ్ తెలిపింది. బెంగళూరులో జరిగిన మీటింగ్ లో ప్రస్తుతం ఐటీ ఇండస్ట్రీలో పరిణామాలపై చర్చించింది. వర్క జరిగే విధానం పూర్తిగా మారిపోతోందని పేర్కొంది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# రైతాంగ సమస్యలు పరిష్కరించండి బైక్ ర్యాలీ





నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్19 (డీకే చాటింపు): రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో తేదీ శనివారం మోపాల్ తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి డిప్యూటీ తహసిల్దార్ గారికి మెమోరాండం ఇవ్వడమైనది. అనంతరం జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలో భాగంగా మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తానని చెప్పిన నేటికీ దాని అమలుకు పూనుకోలేదు అని అన్నారు. వ్యవసాయకూలీలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తాము అన్న 12000 రూపా యలు గత రెండున్నర సంవత్సరాల నుంచి బకాయిలు ఇవ్వాలని వారు కోరారు . కరువు పరిస్థితులు నెలకొంటున్న ఈ సమయంలో రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు పప్పులు, నూనె, కారం తదితర 14 రకాల నిత్యవసర వస్తువులను అందజేయాలని వారన్నారు. మంచిప్ప 21 ప్యాకేజీ పనులకు తగిన నిధులను కేటాయించి పూర్తి చేయాలని మూతపడిన సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలని దాన్ని బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నడిపించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకాఈకార్యక్రమంలో న్యూ డెమోక్రసీ మండల ఎఎ కార్యదర్శి బండమీద నరసయ్య,వేల్పూర్ భుజంధర్ ,కమ్మరి గంగాధర్ శ్రీను, నాగడి సుమన్,రాకేష్ తుంగపల్లి రాజ్ కుమార్, సాయిలు పాల్గొన్నారు.28, 29,30తేదీల లో ఖమ్మం బహిరంగ సభలకు రైతు కూలీలు,రైతులు పెద్దఎత్తున తరలి రావాలని గ్రామ గ్రామాన బైక్ ర్యాలీ కి పిలుపు నిచ్చారు.

# మగ్గిడి పీఎం శ్రీ హైస్కూల్ విద్యార్థులకు రోబోటిక్ శిక్షణ






ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్19 (డీకే చాటింపు):మగ్గిడి లోని స్థానిక పీఎం శ్రీ హైస్కూల్ విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ ఘనంగా శనివారం నిర్వహించడం జరిగింది.విద్యార్థుల కోసం 'రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్' (=శీఎశీఅఎం అఅ ాూఘుఎవఎఅఎం) పేరిట ఒక ప్రత్యేక రోబోటిక్స్ శిక్షణా కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సౌజన్యంతో, బ్యాంక్ పరివర్తన్ స్మాల్ గ్రాంట్స్ ప్రోగ్రామ్ మద్దతుతో మరియు భారత్ కేర్స్ నిర్వహణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ శిక్షణలో భాగంగా స్కూల్ లోని హైస్కూల్ విద్యార్థులకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కేవలం పుస్తకాల్లోని చదువుకే పరిమితం కాకుండా, విద్యార్థులు తమ చేతులతో స్వయంగా రోబోలను ఎలా తయారు చేయాలో ప్రాక్టికల్ గా నేర్చుకున్నారు. ఆర్డునో ప్లాట్‌ఫారమ్ ఆధారంగా సెన్సార్లు, మోటార్లు మరియు సర్క్యూట్ బోర్డులను ఉపయోగించి వినూత్నమైన రోబోటిక్ ప్రాజెక్టులను, స్మార్ట్ కార్లను విద్యార్థులు రూపొందించారు.కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ ,సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మరియు మ్యాథ్స్ పట్ల ఆసక్తిని పెంచడమని అన్నారు.ఈ శిక్షణ ముగిసిన తర్వాత కూడా విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకునేలా స్కూల్ లో ఒక 'రోబోటిక్స్ క్లబ్' ను ఏర్పాటు చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మారుతున్న ఆధునిక సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను క్రిటికల్ థింకింగ్ మరియు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ లో నిపుణులుగాతీర్చిదిద్దడంభవిష్యత్తుక ుసన్నద్ధంచేయడమని ఈ కార్యక్రమంలో క్షత్రియ ఇంజినీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొని స్కూల్ పిల్లలకి వివరించడం హర్షణీయమని అభినందించారు.ఈ సందర్భంగా స్థానిక మగ్గిడి గ్రామ సర్పంచ్ చంద్రకాంత్ గౌడ్ సదర్శించి అక్కడికి వచ్చిన క్షత్రియ కాలేజ్ విద్యార్థులను అభినందించడం తో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైతం ఇలాంటి అత్యాధునిక రోబోటిక్స్ శిక్షణను ఉచితంగా అందించాలని కోరారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిత మేడం, పంచాయతీ సెక్రటరీ విద్యా సాగర్, వార్డ్ మెంబెర్ శ్రీనివాస్ డైనమిక్ సాయి భూమేష్ మరియు ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐ టి టవర్స్ లో హకాతాన్ 2026.. కార్యక్రమం పాల్గొన్న పోలీస్ కమీషనర్

## యువత మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగ చేసుకోవాలి




నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్19 (డీకే చాటింపు):శనివారం నాడు యెన్ యెన్ ఏ ఐ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ఐ టి టవర్స్ యందు ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత, టెక్నాలజీ నిపుణులతో ముచ్చటిస్తూ వారు రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులు మరియు సమస్యల పరిష్కార విధానాలను పరిశీలించారు.ప్రస్తుత ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కీలకంగా మారుతోందని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వివిధ సామాజిక సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను అభివృద్ధి చేసే అవకాశం ఉందని పోలీస్ కమిషనర్పేర్కొన్నారు.యువతలో ఉన్న సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సాంకేతిక నైపుణ్యాలను సరైన దిశలో వినియోగిస్తే సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరు తుందని తెలిపారు వంటి కార్యక్రమాలు యువతను సాంకేతిక రంగంలో మరింత ప్రోత్సహించడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు వేదికగా నిలుస్తాయని అన్నారు.పోలీసింగ్ వ్యవస్థలో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజా భద్రత, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, డేటా విశ్లేషణ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే దిశగా సాంకేతికతకు ప్రాధాన్యత పెరుగుతోందని పేర్కొన్నారు. యువత కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడమే కాకుండా, దానిని ప్రజా ప్రయోజనం, సమాజ శ్రేయస్సు మరియు దేశ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.యువత రోడ్ భద్రత నియమావళిని తప్పనిసరిగా పాటించాలని 2025 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల వలన జిల్లా వ్యాప్తంగా 327 మంది మరణించారని అదే కోవిడ్ సమయంలో 200 మంది చనిపోయారని గుర్తు చేశారు. యువత అనుక్షణం సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ,డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. హ్యాకథాన్‌లో పాల్గొన్న యువత, విద్యార్థులకు ప్రశంసా పత్రములు ఇచ్చి అభినందించారు.శ్రీ నజీబ్ (సి.ఈ.ఓ) , షేక్ సబ్బార్ ( మేనేజర్ ), రజనీకాంత్ (కాకతీయ ప్రిన్సిపాల్ ) ప్రతినిధు లు , నిర్వాహ కులు , టెక్నాలజీ నిపుణులు , విద్యార్థులు మరియు యువత పాల్గొన్నారు.



# ఎంపీపీఎస్ లో.. పేరెంట్స్- టీచర్స్ సమావేశం...



జనగామ/లింగాల ఘనపురం సెప్టెంబర్ 19 డీకే చాటింపు జిల్లా ప్రతినిధిజనగామ జిల్లాలింగాల ఘనపురం మండలం ఎంపిపిఎస్ చీటూరు గ్రామ పాఠశాలలో శనివారం పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించారు.తల్లిదండ్రులతో భాగస్వామ్యం-ప్రతి బిడ్డ అభ్యసనానికి బలం అనే లక్ష్యంతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జి.మంజుల మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం ఎంతో ముఖ్యమని, విద్యార్థుల అభ్యసన స్థాయి, హాజరు, విద్యా ప్రగతి తదితర అంశాలపై తల్లిదండ్రులతో చర్చించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన స్థాయిని తల్లిదండ్రులకు వివరించి,పిల్లలకు ఇంటి వద్ద కూడా చదువుపై తగిన ప్రోత్సాహం అందించాలని,విద్యార్థుల క్రమం తప్పని హాజరు,చదువులో పురోగతి,పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యంపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.తులసీరత్నం,వకులాదేవి,డి.కృష్ణమూర్తితో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తమ సహకారం అందిస్తామని తల్లిదండ్రులు తెలిపారు.

# హైస్కూల్ విద్యార్థులకు యూనిఫామ్, షూస్ పంపిణీ




నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్19 (డీకే చాటింపు): పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మగ్గిడి విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ మరియు షూస్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మగ్గిడి గ్రామ సర్పంచ్ చంద్రకాంత్ గౌడ్ తన చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గారుమాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా సౌకర్యాలను,పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ మరియు రోబోటిక్స్ వంటి అధునాతన శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు హరిత ,పంచాయతీ సెక్రటరీ విద్యా సాగర్, వార్డ్ మెంబెర్ శ్రీనివాస్ డైనమిక్ సాయి భూమేష్ మరియు ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రస్మా--బెల్లంపల్లి నూతన కమిటీ నియామకం....



బెల్లంపల్లి(డీకే చాటింపు )బెల్లంపల్లిలోని సెయింట్ ఆంటోనీ పాఠశాలలో ట్రస్మా--బెల్లంపల్లి నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా--బెల్లంపల్లి మండల అధ్యక్షులుగా బగ్గని శేషు కుమార్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తి, కోశాధికారిగా స్వర్ణలత, వైస్ ప్రెసిడెంట్‌గా సందేశ్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా రాజలింగు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్,జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ గౌడ్, జిల్లా కోశాధికారి శ్రీధర్, జిల్లా బాధ్యులు సిద్దయ్య, శరత్, స్టేట్ ఈసీ మెంబర్ అఖిలేందర్ సింగ్, జిల్లా సభ్యులు చక్రపాణి, శ్రీనివాస్, రవి ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ట్రస్మా--బెల్లంపల్లి మండల అభివృద్ధికి, ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి, పాఠశాలల మధ్య సమన్వయానికి మరియు సభ్యుల సంక్షేమానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు

# గుండ్ల చెరువును సందర్శించిన కలెక్టర్, కమిషనర్



ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్ 19 (డీకే చాటింపు):వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆర్మూర్ ప్రాంతంలో వినాయక నిమజ్జనం చేసే గుండ్ల చెరువును శనివారం జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సందర్శించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సంబంధిత అధికారులు అందరికీ సూచనలు చేశారు. వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, లైటింగ్, క్రేన్, మంచినీరు సౌకర్యం కల్పించాలన్నారు. కలెక్టర్ తో పాటు ఆర్మూర్ సబ్ కలెక్టర్, ఎమ్మార్వో, ఎండిఓ, పోలీసు అధికారులు, ఎలక్ట్రిసిటీ ఏఈ, పంచాయతీరాజ్ అధికారులు మున్సిపాలిటీ చైర్మన్, కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రైతాంగ సమస్యలకు పరిష్కారం ఎప్పుడు..?

వ్యవసాయ సంక్షోభ నివారణకు, రైతు ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు ఆదాయ-సామాజిక భద్రత చేకూర్చేందుకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి (సి2 ప్లస్ 50 శాతం) చట్టబద్ధ ఎం.ఎస్.పి ధరలు ప్రకటించాలని 2006 లోనే నివేదిక నిచ్చినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. రైతాంగ సమస్యల పరిష్కారం చేస్తానని 2021 డిసెంబర్ 9వ తేదీన ఇచ్చిన లిఖితపూర్వక హామీని తుంగలో తొక్కడమేకాక, కనీస మద్దతు ధరల విధానానికి మంగళం పాడుతూ "జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం" (ఎన్.పి.ఎఫ్.ఎ.ఎమ్)ను ప్రకటించి, "పంట ధర ఇన్సూరెన్స్" ముసుగులో ఎం.ఎస్.పి ని ఎత్తివేసే ద్రోహానికి ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వం పూనుకొంది. 2000 నుండి 2013 మధ్య కాలంలో ఎం.ఎస్.పి ధరలు తక్కువగా నిర్ణయించబడటం వలన 23 పంటల పైన భారత రైతాంగానికి రూ.45 లక్షల కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని ఒ.ఇ.సి.డి-ఐ.సి.ఆర్.ఐ.ఇ.ఆర్ సంస్థలు పేర్కొన్నాయి. సగటున ఏటా రైతాంగానికి రూ.3 లక్షల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఉదాహరణకు క్వింటాలు వరి ధాన్యానికి రూ.766, మొక్కజొన్నకు రూ.704, జొన్నకు రూ.1,110, కందికి రూ.2,874, మినుముకు రూ.2646, పెసరకు రూ.2,446, పత్తికి రూ.2365 చొప్పున నష్టపోతున్నారు. అందుకే చట్టబద్ధ ఎం.ఎస్.పి ధరలను ప్రకటించాలని పట్టుబడుతున్నాం.

**ప్రైవేట్ వారికోసమే విద్యుత్ సవరణ చట్టం:** వ్యవసాయానికి ఉచిత/తక్కువ టారిఫ్‌తో విద్యుత్, బలహీన వర్గాల పేదలకు రాయితీ విద్యుత్‌లను తొలగించి, మొత్తం ఖర్చులన్నిటితో లెక్కించిన టారిఫ్‌ను, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి, నెలలో ముందుగానే సెల్‌ఫోన్ల తరహాలో బిల్లులు వసూలు చేయాలనే దుష్ట విధానాన్ని ఎన్.డి.ఎ. ప్రభుత్వం తెచ్చింది. అంతేకాక పలు దశాబ్దాల కాలంలో ప్రజల నుండి పన్నుల ధనం, బ్యాంకుల నుండి/పి.ఎఫ్.సి నుండి రుణాలతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, విద్యుదుత్పత్తి సంస్థలు, డిస్కమ్‌లతో సహా కారుచౌకగా (బుక్ వాల్యూకు) ప్రైవేట్ వారికి కట్టబెట్టే ఈ దుష్ట చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాం.


**విత్తన చట్టం రైతాంగ వ్యతిరేకం:** విత్తన చట్టం 1966 లోని లోపాలను సరిచేయడానికి బదులు, విదేశీ విత్తన కంపెనీల ప్రయోజనాలను మెరుగు పరిచేందుకు తీసుకువచ్చిన ఈ చట్టంలో నాణ్యత లేని నకిలీ విత్తనాల వల్ల రైతులకు చేకూరిన నష్టానికి పరిహారం గురించి లేకపోవడం అత్యంత ఆశ్చర్యకరం. బహుళజాతి, విదేశీ విత్తన కంపెనీల తెరచాటు సూచనలతో రూపొందించబడిన ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాం.

**ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి చట్టాన్ని అమలు చేయాలి:** గ్రామీణ నిరుపేదలకు ఉపాధిని, ఆదాయాన్ని సమకూరుస్తూ, ఆహార భద్రతను పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో గాంధీజీ పేరు తొలగించడమేకాక, రాజ్యాం గం లోని ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా, రాష్ట్రాల హక్కులను హరిస్తూ, రాష్ట్రాలను సంప్రదించకుండానే 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం ద్వారా దేశంలోని కోట్లాదిమంది నిరుపేదలకు ఎన్.డి.ఎ ప్రభుత్వం ద్రోహం చేస్తున్నది. ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి చట్టాన్ని అటకెక్కి ంచడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశంగా కనబడుతోంది. అందువలననే వి.బి.గ్రామ్‌జీ పథకాన్ని ఉపసంహరించి...మరికొన్ని మార్పులతో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

**పంట భూములను లాక్కోవడం ఆపాలి:** షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, ఇతర అణగారిన, వెనుకబడిన వర్గాల, పేదల ప్రయోజనాలను పరిరక్షించేందుకు భారత రాజ్యాంగం పేర్కొన్న సూత్రాలను భారత సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పులను దృష్టిలో వుంచుకొని, వాటికి భంగం కలుగని రీతిలో భూములను కేటాయించడం అవసరం. కేవలం పారిశ్రామికవేత్తలు కోరిన చోట, కోరినంత విస్తీర్ణాన్ని ఇవ్వాలనుకోవడం తగదు. ప్రజా ప్రయోజనం కోసం మాత్రమే ప్రభుత్వం భూమిని సేకరించాలని, రైతుల పంట పొలాలను, ముఖ్యంగా బలహీన వర్గాలకు ఎసైన్ చేసిన భూములను తీసుకోరాదని డిమాండ్ చేస్తున్నాం.


**నూతన జాతీయ సమగ్ర కౌలు చట్టం అవసరం:** కౌలు రైతులు అత్యధికంగా భూమి లేని, సన్నకారు, చిన్న రైతులు, బలహీన వర్గాలకు చెందినవారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలను అందించడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు నీతి ఆయోగ్ సంస్థ "మోడల్ ల్యాండ్ లీజ్ చట్టాన్ని" అమలు చేయాలని రాష్ట్రాలకు పంపించింది. అయితే ఈచట్టం ప్రకారం రైతుతన భూమిని ఫలానా వ్యక్తికి కౌలుకిచ్చినట్లుగా సంతకం చేయాల్సి వుంటుంది. వెనుకటి కాలంలో వున్న కౌలు చట్టాలు రద్దయ్యాయన్న సమాచారం తెలియకపోవడం, తన భూయాజమాన్య హక్కుకు భంగం కలుగుతుందేమోనన్న అనుమానంతో రైతులలో అత్యధికులు సంతకం చేయడానికి ముందుకు రావడం లేదు. ఫలితంగా కౌలు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద, ధనిక రైతులవద్ద హెచ్చువడ్డీలకు రుణాల తీసుకోవలసిన పరిస్థితులు న్నాయి.

# రీ ఎంట్రీకి విజయసాయిరెడ్డి..!



నెల్లూరు, : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒక గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా రాజధాని ప్రతిపాదన విషయంలో జగన్ చుట్టూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు ఆ పార్టీకి టిడిపి, జనసేన బలమైన ప్రత్యర్థులుగా ఉన్నారు. కానీ ఆ జాబితాలో ఇప్పుడు చాలా పార్టీలు వచ్చి చేరుతున్నాయి. చివరకు ఇప్పటివరకు స్నేహంగా వ్యవహరించిన గులాబీ పార్టీ సైతం రూటు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. అమరావతి రాజధాని విషయంలో పక్కన ఉన్న తెలంగాణలో సైతం జగన్మోహన్ రెడ్డి పట్ల ప్రతికూలత వస్తోంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లు పై చర్చ జరిగిన సమయంలో కాంగ్రెస్ సభ్యురాలు రేణుకా చౌదరి మాటలు చూస్తే మాత్రం జగన్ పై వ్యతిరేకత ఎలా ఉందో అర్థమవుతుంది. మరోవైపు అది చాలదన్నట్టు జగన్మోహన్ రెడ్డి మావిగన్ రాజధాని ప్రతిపాదనను సొంత పార్టీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నాయి. ఎప్పుడు సోషల్ మీడియాలో జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసేవారు సైతం దిక్కుమాలిన సలహా అంటూ విరుచుకుపడుతున్నారు. మావిగన్ ప్రతిపాదన అనేది జగన్మోహన్ రెడ్డి సొంత నిర్ణయం అని సజ్జల లాంటి వారు మీడియా ముందుకు వచ్చి చెప్తున్నారు.అయితే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్మోహన్ రెడ్డి నిర్ణయం ఫైనల్ అన్నట్టు ఉండేది. జగన్ పై ఈగ వాలితే అంతా పడిపోయేవారు. కానీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చించే క్రమంలో జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నాయి వివిధ పార్టీలు. కానీ కనీసం కౌంటర్ ఇవ్వలేకపోయారు ఆ పార్టీ నేతలు. నిండు రాజ్యసభలో జగన్మోహన్ రెడ్డి పై కాంగ్రెస్ ఎంపీలు విరుచుకుపడితే ఏం చేస్తున్నట్టు అని ఆ పార్టీకి గుడ్ బై చెప్పిన ఎంపి విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. ఇదేనా మీ సమర్థత అంటూ ప్రశ్నించడం ప్రారంభించారు. ఇక్కడ విజయసాయిరెడ్డి రెండు రకాల లక్ష్యాలను నెరవేర్చుకున్నారు. ఒకటి తనలాంటి వాడు జగన్ వెంట లేకపోవడం లోటు అని సంకేతాలు పంపాడు. కేంద్ర రాజకీయాల్లో వైసీపీకి అత్యవసరంగా ఒక నేత అవసరం అని గుర్తు చేశారు.మరోవైపు కూటమికి వ్యతిరేకంగా ట్వీట్ చేశారు విజయసాయిరెడ్డి. అమరావతి రాజధాని కి చట్టబద్ధత కల్పించడం ఎంత ముఖ్యమో.. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయడం అంతే ముఖ్యం అని హెచ్చరిస్తూ స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. కొత్త రాజధాని ప్రతిపాదన కంటే రైతుల సమస్యలపై వైసీపీ పోరాడితే బాగుంటుందని సూచనలు ఇచ్చారు. అయితే ఇప్పటికీ తాను కూటమికి వ్యతిరేకమని.. అవసరం అనుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధమని సంకేతాలు పంపగలరు. ఏడాది కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ ద్వారా వచ్చిన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన ఆయన తరువాతే ఎందుకో రాజకీయాలు మాట్లాడుతూ వచ్చారు. రాజకీయాలు చేయాలని ఉందని చెప్పుకొచ్చారు. బిజెపిలోకి వెళ్తారని కూడా ప్రచారం జరిగింది. కానీ కూటమి నుంచి అభ్యంతరాలు రావడంతో ఆయన డిఫెన్స్ లో పడిపోయారు. అందుకే జగన్ ఒప్పుకుంటే తిరిగి వైసీపీలో చేరుతానని సంకేతాలు పంపుతున్నారు. కానీ జగన్ అందుకు ఒప్పుకుంటారో? లేదో? చూడాలి.

# జనారణ్యంలోకి జంతువులు



కర్నూలు, : రాయలసీమ వ్యాప్తంగా జనావాసాల్లోకి చిరుతల చొరబాట్లు పెరగడం కనిపిస్తోంది. పులులకు తీవ్రమైన నీటి కొరత, ఆవాసాలు తగ్గిపోవడం, పెరుగుతున్న పర్యావరణ ఒత్తిడే ఈ ధోరణికి కారణమని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోకపోతే.. ఈ ప్రాంతంలో మానవ-వన్యప్రాణుల సంఘర్షణ తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా దువ్వూరు మండలం చిన్న బకరపురం గ్రామంలో ఇటీవల జరిగిన ఓ ఘటన జరిగింది. గ్రామంలోకి ప్రవేశించిన చిరుత పిల్లను వీధి కుక్కలు చంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అటవీ అధికారుల సమాచారం ప్రకారం, రాయలసీమలో గత మూడేళ్లలో మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశించిన 30కి పైగా చిరుతలు మరణించాయి. ఆందోళనకరంగా, గత సంవత్సరంలోనే 16 మరణాలు నమోదయ్యాయి.చిరుతపులులు మేకలు, గొర్రెలు, దూడలు, ఆవులు వంటి జంతువులను ఇష్టపడతాయి. ఆహారం కోసం అవి మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయి. కొన్నిసార్లు, అటవీ ప్రాంతాల్లో సమీపంలో నీటి వనరులు లేకపోవడం కూడా ఒక కారణంగా ఉంది. చిరుతపులులు దట్టమైన అడవుల్లో లోపల ఉండటానికి బదులుగా, కొద్దిగా బహిరంగ లేదా మైదాన ప్రాంతాల్లోకి వెళ్లడానికి ఇష్టపడతాయని అటవీ అధికారులు అంటున్నారు.చిరుతపులులు మనుషులపై దాడి చేయడానికి బయటకు రావడం లేదు. కానీ ఆకస్మాత్తుగా మనిషి ఎదురైతే దాని రక్షణలో భాగంగా దాడి చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. వాటి సంచారం ప్రధానంగా ఆహారం, నీటి అన్వేషణ కోసమే ఉంటుంది. అడవుల అంచున ఉన్న గ్రామాల్లోకి చిరుతలు ఎక్కువగా వస్తుంటాయి.వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులు, అడవి పందులను నివారించడానికి రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలు పులులకు ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్ కంచెల కారణంగా ప్రమాదవశాత్తు మరణాలు పెరుగుతున్నాయి. రైతులలో తక్షణమే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.అటవీ భూముల ఆక్రమణలతో పులుల సహజ ఆవాసాలను తగ్గిపోయేలా చేస్తూ, వన్యప్రాణులను మానవ నివాసాలకు మరింత దగ్గరగా నెడుతున్నాయి. దట్టమైన అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ఇప్పుడు జనావాస ప్రాంతాల వైపు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుతపులుల సంచారం ఎక్కువగా ఉందని, ఇది తమ జీవనోపాధికి ముప్పుగా మారిందని రైతులు వాపోతున్నారు.కొన్నిసార్లు పొలాల దగ్గర చిరుతపులులు సంచారం ఉన్నట్టుగా రైతులు చూస్తున్నారు. దానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పశువులను, మేకలను మేతకు బయటకు తీసుకెళ్లాలంటే భయపడుతున్నాయి.

# సమ్మెకు దిగిన విద్యుత్ ఆర్టిజెన్ ఉద్యోగులు!


## పర్మనెంట్ చేసి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్!

జనగామ :తాము దశాబ్దాల తరబడి ఎట్టి చేస్తున్నప్పటికీ మాతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న మా విద్యుత్ శాఖ మమ్మల్ని పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించకుండా, నిర్లక్ష్యం చేస్తున్నదని,పాలకులు మమ్మల్ని ధగా చేస్తున్నరని విద్యుత్ శాఖలో పని చేస్తున్న వివిధ యూనియన్లకు చెందిన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నరు.ఉద్యమ ప్రభుత్వం 2017 లో పర్మనెంట్ చేస్తానంటే ఉద్దరిస్తుందని నమ్మినం. కానీ 2020 లో కొత్త సర్వీస్ రూల్ తెచ్చి నమ్మి నానబోస్తే పుచ్చిబుర్రలు చేసి తెచ్చిపోసినట్లు ఉత్త చేతులు మా మొఖాన కొట్టిందని,గత ప్రభుత్వాలు చేసిన అన్యాయాన్ని సరిదిద్ది నేటి ప్రభుత్వం మాయడల మానవత్వాన్ని ప్రదర్శించాలని,మా న్యాయ మైన డిమాండ్లను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కోరుతున్నరు. ఈ రోజు స్టేషన్ ఘనపూర్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిభి రంలో ప్రసంగించి నకార్మిక సంఘం నేతపాశం రాజుతదితరులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్హతల ఆధారంగా ఇప్పటి వరకు పర్మనెంట్ కాని ఉద్యోగులను అందరిని పర్మనెంట్ ఉదోగులుగా ఆయా కేటగిరిల్లో విలీనం చేసుకోవాలని,కెసిఆర్ ప్రభుత్వం తెచ్చిన సర్వీస్ రూల్సుకు చరమ గీతం పాడి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, కోరారు.టీజీ ఎస్పీడీసీఎల్,టీజీ ఎన్పిడిసీఎల్ లోని అన్ మాన్డ వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేసుకోవాలని వారు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.4-12-2016 కంటేముందు విద్యుత్ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న విద్యావంతులను ఆర్టిజెన్ లుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యుత్ శాఖలో అనేక అవసరాల్లో వినియోగించుకుంటూ,ఏ గుర్తింపు ఇవ్వకుండా ఎట్టివాళ్లుగాఉట్టిగనే వదిలేసిన వాళ్లలోని అర్హులైన పీస్ రేట్ కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించి 2026 పీర్సీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


# వైసీపీతో బీసీవై కలిసి పోటే..!

విజయవాడ,: రాజకీయాల్లో ఎవరు ఎప్పుడు ఏ స్థితిలో ఉంటారో చెప్పలేము. ఎందుకంటే ఒకసారి ఓటమి ఎదురవుతుంది. మరోసారి గెలుపు తలుపు తడుతుంది. అయితే రాజకీయ అవసరాలు కూడా అంతే. ఎవరితో ఏ అవసరం వస్తుందో చెప్పలేం కూడా. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అదే పరిస్థితి. ప్రత్యర్థి పార్టీలను ఓ రేంజ్ లో వేసుకోవడం వైసీపీకి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అయితే ఈ విషయంలో జనసేన కూడా బాధితురాలు. ఎందుకంటే జనసేన ను టార్గెట్ చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రచారం అంటూ లేదు. మొన్న జనసేన సంపూర్ణ విజయం, వైయస్సార్ కాంగ్రెస్ దారుణ ఓటమితో ఈ ప్రచారం కొట్టుకెళ్లిపోయింది. కానీ ఇప్పుడు అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భారత చైతన్య యువజన పార్టీ.. అలియాస్ బిసివై పార్టీపై ఆధారపడుతోందన్న టాక్ ప్రారంభం అయింది. ఆ పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడుతుండడం కొత్త రాజకీయ పరిణామం.చిత్తూరు జిల్లాకు చెందిన బోడె రామచంద్ర యాదవ్ భారత యువజన చైతన్య పార్టీని ఏర్పాటు చేశారు. బడుగులకు రాజ్యాధికారం అన్న నినాదంతో ఈ పార్టీని స్థాపించారు. పారిశ్రామికవేత్త అయిన బోడే రామచంద్ర యాదవ్ కు కేంద్రంలో మంచి పట్టు ఉంది. 2019 ఎన్నికల కు ముందు పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి జనసేన తరఫున పుంగనూరు నుంచి పోటీ చేశారు. కానీ ఓటమి ఎదురయింది. కనీసం డిపాజిట్లు రాలేదు. అయితే తరువాత భారత చైతన్య యువజన పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బీసీవై పార్టీని టార్గెట్ చేశారు. పలుమార్లు బోడే రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి కూడా జరిగింది. కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టార్గెట్ చేస్తూ చంద్రబాబు బీసీవై పార్టీ వెనుక ఉన్నారనేది అప్పట్లో ఒక విమర్శ.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అయితే బోడె రామచంద్ర యాదవ్ పై ఓ రేంజ్‌లో విరుచుకుపడేవారు. ఆయన పేరును ప్రస్తావించేందుకు కూడా ఇష్టపడేవారు కాదు. పూజకు పనికిరాని పువ్వు అని సంబోధించేవారు. గతంలో బోడె రామచంద్ర యాదవ్ పై దాడి జరిగినప్పుడు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఖండించారు. ఒక సాధారణ నేతగా ఉన్న బోడె రామచంద్ర యాదవ్ విషయంలో ప్రతిపక్ష నేత స్పందించడం అప్పట్లో ఒక సంచలనమే. కనీసం బీసీవై పార్టీ ఒక పార్టీయేనా అని వ్యాఖ్యానించేవారు వైసీపీ సామాన్య కార్యకర్తలు.. కానీ ఇటీవల ఎందుకో బోడె రామచంద్ర యాదవ్ రూట్ మారింది. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వాన్ని విపరీతంగా వ్యతిరేకిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి విషయంలో సానుకూలంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి కట్టాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. అందులో భాగంగానే బీసీవై పార్టీని కూటమి ప్రభుత్వంపై ఉసిగొల్పుతున్నారన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# అతిథి పక్షులకు స్వర్గధామం



వరంగల్, : అనేక సంవత్సరాలుగా వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే విదేశీ అతిథి పక్షులకు స్వర్గధామంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి నిలుస్తోంది. ప్రకృతి అందాలతో నిండినఈ గ్రామంలోని చెరువులు, చెట్లు వలస పక్షులను అక్కున చేర్చుకుని, ఆశ్రయం ఇచ్చి.. పురుడుపో స్తున్నాయి.అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంర క్షణ బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల పుట్టినిల్లుగా ఏళ్ల తరబడి నిలబెడుతున్న గ్రామస్తులు ఎంతో స్ఫూర్తి నిస్తున్నారు. పక్షుల తల్లిప్రేమను, పిల్లల కేరింతలను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతున్నారు. సైబీరియా వంటి చల్లని ప్రాంతాల నుంచి పక్షులు, ముఖ్యంగా కొంగలు (పెయింటర్ స్టోర్క్) మేచరాజుపల్లికి తరలివచ్చి, నివాసం ఏర్పరచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేల సంఖ్యలో సైబీరియన్ కొంగలు, ఇతర వలస పక్షులు చేరుకుంటాయి. చల్లని దేశాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వేడి ప్రాంతాల కోసం ఈ



పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయా ణించి ఇక్కడకు ప్రతి ఏటా క్రమం తప్పకుం డా వస్తాయి.డిసెంబర్ నుంచి జూలై వరకు గ్రామంలోని చెట్లపై గూళ్లు కట్టి గుడ్లు పెట్టి సంతానోత్ప త్తి చేసి, పిల్లలు పెద్దయ్యాక తిరిగి జూలై నెలలో పిల్లలతో కలిసి తమ స్వదేశాలకు వెళ్లిపోతాయి. వీటి ప్రధా న ఆహారం చెరువులోని చేపపిల్లలు. చేప పిల్లలను వేటాడి చెట్లపై నిలువ పెట్టుకోవడం మరో ప్రత్యేకతగా నిలుస్తోంది.మేచరాజుపల్లి చెరువు పరిసర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పక్షుల కిలకిలారావాలు వినిపిస్తూ సందర్శకులను ఆకట్టుకుంటాయి. గుంపులుగా ఎగిరే పక్షు లు ఆకాశంలో అద్భుత దృశ్యాన్ని సృష్టిస్తా యి. ఈ కాలంలో చెట్లపై కనిపించే వందలాది విదేశీ అతిథి పక్షులను చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు.గ్రామస్థులు ఈ పక్షులను తమ అతిథులుగా భావించి, సంరక్షణ చర్యలు చేపడుతు న్నారు. ప్రతి ఏడాదీ వచ్చే విదేశీ అతిథి పక్షు ల రాక కోసం నిరీక్షించడం, చెట్లను నరకకుండా కాపాడటం, పక్షులకు ఇబ్బంది కలి గించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇలా అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంరక్షణ బాధ్యతలను తు.చ తప్పకుండా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల ఆవాసంగా ఏళ్ల తరబడి నిలబెట్టుతున్నారు.ఒక్కో పక్షి మూడు నుంచి నాలుగు గుడ్లు పెట్టి, 30 నుంచి 45 రోజుల పాటు పొదుగుతుంటాయి. జన్మించిన తమ పిల్లలకు ఇక్కడే ఎగరడం, మేత మేయడం, ఆహారాన్ని సంపాదించడం తదితర నైపుణ్యాలను తల్లి పక్షులు నేర్పిస్తుంటాయి. ఈ ప్రకృతి విన్యాసాలను, తల్లిప్రేమను, పిల్లపక్షుల కేరింతల ను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతుంటారు. ప్రకృతి అందాలు, విదేశీ వలస పక్షుల సందడి కారణంగా మేచరాజుపల్లి పర్యాటక కేంద్రంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సరైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే పక్షి ప్రేమికులకు, ప్రకృతి సందర్శకులకు ఆకర్షణీయ ప్రాంతంగా అభివృద్ధి చెం దుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పక్షుల సంరక్షణకు చెరువు అభివృద్ధి, చెట్ల సంరక్షణ, పర్యాటక సదుపాయాల కల్పన వంటి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.పర్యావరణ పరిరక్షణ తో పాటు పర్యాటకాభివృద్ధి జరిగితే మేచరాజుపల్లి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంది. వేల కిలోమీటర్ల ప్రయా ణం చేసి వచ్చే అతిథి పక్షులతో మేచరాజుపల్లి ప్రకృతి సోయగంగా మారుతూ నిజమైన పక్షుల స్వర్గధామంగా నిలుస్తోంది

# 14 ఏళ్ల నాటి కల..


కరీంనగర్, : రాజకీయాల్లో ఏ వ్యూహం ఎప్పుడు పారుతుందో.. ఏ స్కెచ్ ఎప్పుడు ఫలిస్తుందో ఎవరూ ఊహించలేరు. ప్రత్యర్థి పార్టీని నామరూపాలు లేకుండా చేయాలనే పంతం పన్నెండేళ్ల తర్వాత ఇప్పుడు కార్యరూపం దాల్చడం చూస్తుంటే రాజకీయ చదరంగం ఎంత చిత్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో కాంగ్రెస్‌ను ఖాళీ చేయాలని కేసీఆర్ వేసిన ప్లాన్ చేశారు. ఇన్నాళ్లకు 'జగిత్యాల టైగర్' జీవన్ రెడ్డి రూపంలో సక్సెస్ అయింది. అప్పట్లో తృటిలో తప్పిన ఈ ఫిరాయింపు, ఇప్పుడు రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయాల పుణ్యమా అని సాధ్యపడింది. రాజకీయాల్లో ఫిరాయింపులు కొత్త కాదు కానీ, పన్నెండేళ్ల క్రితం వేసిన స్కెచ్ ఇప్పుడు ఫలించడం విశేషం. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన కొత్తలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరినీ టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) కలిపేసుకోవాలని గట్టి ప్రయత్నం చేశారు. ఆ సమయంలోనే జీవన్ రెడ్డికి గులాబీ గూటి నుంచి ఆహ్వానం అందింది. అయితే ఈ విషయాన్ని తాజాగా జరిగిన ప్రెస్ మీట్‌లో జీవన్ రెడ్డి స్వయంగా బయటపెట్టారు.

అటు కేటీఆర్ కూడా 'ఆయన 2014లోనే మా పార్టీలోకి రావాల్సింది, అది ఇప్పటికి కుదిరింది' అని వ్యాఖ్యానించడం ద్వారా నాటి స్కెచ్‌ను పరోక్షంగా ఒప్పుకున్నట్లు అయ్యింది.జగిత్యాల పంచాయతీ జీవన్ రెడ్డి మనస్థాపానికి ప్రధాన కారణం తన రాజకీయ ప్రత్యర్థి సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడమే. రెండు ఎన్నికల్లో తనను ఓడించిన వ్యక్తిని రేవంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించడాన్ని జీవన్ రెడ్డి తట్టుకోలేకపోయారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోవడం, మెజారిటీ కౌన్సిలర్లు సంజయ్ వర్గం వైపు ఉండడంతో జీవన్ రెడ్డికి సొంత గడ్డపైనే భంగపాటు జరిగింది. మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కకపోవడంతో తన రాజకీయ భవిష్యత్తుపై ఆయన ఒక నిర్ణయానికి వచ్చారు. ఎంతో కాలం నిరీక్షించిన జీవన్ రెడ్డి రేవంత్ రెడ్డి నాయకత్వంపై యుద్ధం ప్రకటించారు.

# ప్రపంచాన్ని బలి చేసిన ట్రంప్ యుద్ధోన్మాదం !



అమెరికా-ఇజ్రాయిల్ చేసిన యుద్ధంతో సాధించిందేమిటి? ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేసిన ఈ ఇరు దేశాల నేతలు ఇప్పుడు చిద్విలాసంగానే ఉన్నారు. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని చూసి చేతులు కాల్చుకున్నారు. కానీ ప్రపంచ దేశాలు ఆయిల్, గ్యాస్ దొరక్క విలవిల్లాడాయి. ధరలు పెరిగాయి. విమానాలు రద్దయ్యాయి. ఎక్కడికి పోవాలన్నా విమాన ధరలు అందనంతగా పెరిగాయి. ఇంత విధ్వంసం చేసిన ట్రంప్ ..ఇప్పుడు తాత్కాలికంగా రెండు వారాలు యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. నిజానికి శాశ్వతంగా యుద్ధాన్ని ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో పాల్గొనాలి. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఇరాన్‌పై బాంబు దాడులు చేసి సాధించింది మాత్రం శూన్యం. ఓ రకంగా చెప్పాలంటే ఈ యుద్ధంలో ట్రంప్ ప్రథమ దోషి. తరవాతి స్థానం నెతన్యాహూది. వీరి యుద్ధ కాంక్షకు, నిరంకుశ వైఖరికి ప్రపంచ దేశాలు అల్లాడాయి. బాంబు దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైపోతోంది. చమురు ధరలు పెరిగాయి. చమురు అందకుండా పోయింది. నౌకలు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. డాలర్ల లెక్కలో ముడిచమురు ధరలు పెరిగిపోయాయి. దాని వెనువెంటనే ఇతర దేశాల కరెన్సీల, ముఖ్యంగా ఆసియా దేశాల కరెన్సీల విలువలు పడిపోవడం మొదలైంది. దీని ఫలితంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కన్నా ఎక్కువ మోతాదులో మూడవ ప్రపంచ దేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థికమాంద్య ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. చమురుకు కొరత ఏర్పడినందువలన ఎరువుల ఉత్పత్తి తగ్గిపోయింది. దాంతో ఆ ఎరువుల కొరత ఏర్పడింది. దాని ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి దెబ్బ తింటోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో దుర్భర పరిస్థితుల మధ్య శ్రామిక ప్రజానీకం చిక్కుకుపోతున్నారు. ఇలా ట్రంప్ సాధించిన ఘనతలకు ఇవన్నీ నిదర్శనాలుగా చెప్పుకోవాలి. ఈ సంక్షోభానికి దారి తీసిన చట్టవిరుద్ధమైన, అనైతికమైన యుద్ధానికి ముగింపు తాత్కాలికం కారాదు. శాశ్వతంగా యుద్ధాన్ని ముగించేందుకు బేషరతుగా ట్రంప్ అడుగులు వేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు చాలా చిన్న విషయమే అయినా, చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత స్థాయిలో ప్రభావం చూపడం చూస్తున్నాం. ఎందుకంటే చమురు చుట్టే అన్నీ పెనవేసుకుని ఉన్నాయి. సామ్రాజ్యవాద విస్తరణ, ఆక్రమణ యత్నాలకు ప్రధాన కారణం ముడిపదార్థాల మీద అదుపు సంపాదిం చడమేనని ఇప్పుడు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. వెనెజువెలా తరవాత ఇరాన్‌పై దాడి సులభంగా అవుతుందనుకున్న ట్రంప్‌కు ఇదొక పెద్ద షాక్. ఇకముందు ప్రపంచ దేశాలపై దాడులు చేస్తే ఆయా దేశాలు ఎదురుదాడికి సిద్ధంగా ఉ ంటాయని ట్రంప్ బుద్ధి తెచ్చుకోవాలి. ప్రస్తుత పరిణామాలు ఈ విషయాన్నే బలపరుస్తున్నాయి. ప్రపంచ చమురు ఉత్పత్తుల్లో-ముడి చమురు మాత్రమే కాక దాని నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులన్నీ కలుపుకుని-20 శాతం మాత్రమే హార్ముజ్ జల సంధి ద్వారా రవాణా అవుతుంది. రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఇంత చిన్న విషయానికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షోభం తలెత్తిందంటే చమురు వంటి ముడిసరుకు ఎటువంటి కీలక పాత్ర పోషిస్తోందో బోధపడుతోంది. అంత కీలకమైన పాత్ర పోషించగలగడానికి కారణం చమురు విశ్వవ్యాప్త వాణిజ్య వస్తువు కావడమే అని గుర్తించాలి. అది ఆర్థిక ఇబ్బందులను సృష్టించగలిగే అవకాశం ఎక్కువగా కలిగి ఉంది. దాని ధర పెరగడం వలన కలిగే ద్రవ్యోల్బణ ప్రభావం అంతే తీవ్రంగా ఉంటుంది. ముడి చమురు ధరలో 10 శాతం పెరుగుదల ఉంటే కలిగే ప్రభావం తక్కువగా ఉంటుంది. ముడిచమురు ధరలో వచ్చే మార్పు ఆర్థిక వ్యవస్థ మీద ఇంతటి తీవ్ర ప్రభావాన్ని కలిగించగలదని ఈ నెల రోజుల్లో మనకు అనుభవంలోకి వచ్చింది.డాలర్ విలువ ముడిచమురు విలువతో ముడిపడిపోయి వుంది. అందుకే డాలర్ ఆధిపత్యం కొనసాగేందుకు అమెరికా డాలర్లను ముద్రించి విడుదల చేస్తోంది. ఆ డాలర్లను స్వీకరించడానికి, వాటి విలువను అంగీకరించడానికి ప్రపంచం కూడా సుముఖంగానే ఉంది. అందుచేత ఇప్పుడు ప్రపంచం అంతా డాలర్లు ఎక్కడబడితే అక్కడ ఉన్నాయి. ఈ పరిస్థితిలో డాలర్ ప్రమాణం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుచేత చమురు-డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం మరింత కీలకంగా మారింది. అలా నిలబెట్టుకోడానికే చమురును ఉత్పత్తి చేసే దేశాల మీద రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది. అందుకే దాడులుకు తెగిస్తోంది. ముడి చమురుపై పెత్తనం కోసం చేస్తున్న యుద్ధంగా దీనిని యూడాలి. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేసి తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనన్న ధీమాతో అమెరికా ఇరాన్ మీద దాడికి దిగింది. అయతుల్లా ఆలీ ఖమేనీతో సహా ఇరాన్ ఉన్నతాధికారులను అంతం చేసి,ఇరాన్‌ను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని, అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకోవాలని అమెరికా చూసింది. తన డాలర్ సర్వాధిపత్యాన్ని మరింత బలపరుచుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా చేసిన ఈ ప్రయత్నం బెడిసి కొట్టిందనే చెప్పాలి. అయితే ప్రపంచం మాత్రం మూల్యం చెల్లించుకుంది.




## రాయలసీమలో ఫ్యాన్ కు ఉక్కపోత

కర్నూలు, : వైసీపీ అధికారంలో లేదు. అందరూ కలసి కట్టుగా పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే రాయలసీమ నేతలు మాత్రం ఒకరినొకరు తిట్టుకుంటూ పార్టీ పరువును నడి బజారున పడేస్తున్నారు. పార్టీ హైకమాండ్ కూడా పెద్దగా పట్టించు కోకపోవడంతో మరింత సీమ వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. రాయలసీమ వైసీపీలో నేతల మధ్య అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో గ్రూపు రాజకీయాలు, టికెట్ల పంచాయితీలు పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ మాత్రం సీమ నేతల చిందులను చూసీ చూడనట్లు వ్యవహారి స్తున్నారు.ఎమ్మిగనూరులో చెన్నకేశవరెడ్డి, బుట్టా రేణుక వర్గాల మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఇరు వర్గాలు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నాయి. ఎమ్మిగనూరులో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుటుంబానికి, మాజీ ఎంపీ బుట్టా రేణుక వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణ నడుస్తోంది. కేడర్ రెండు వర్గాలుగా చీలిపోయింది. సింగనమలలో వర్గపోరు, కదిరిలో నేతల ఘర్షణలు తరచుగా రోడ్డెక్కుతున్నాయి. సింగనమల నియోజకవర్గంలో వైసీపీ నేతల అంతర్గత పోరుబహిరంగంగా బయటపడుతోంది. కదిరి నియోజకవర్గంలో వైసీపీ నేతలు చెప్పులతో కొట్టుకునే స్థాయికి విభేదాలు తీవ్రమయ్యాయి.ఇక అనంతపురం జిల్లాలోని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వాళ్లను వెంటేసుకుని తిరుగుతున్నారంటూ తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఒకసారి పార్టీ మారిన వారిని పార్టీలోకి తీసుకుంటే చెప్పుతో కొడతానంటూ కేతిరెడ్డి మండిపడ్డారు. ఇలా నేతల మధ్య గ్గ విభేదాలు రాబోయే కాలంలో పార్టీబలాన్ని తగ్గిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తెలంగాణ



హైదరాబాద్, : తెలంగాణ ప్రభుత్వం మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను ప్రారంభించింది. గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక ఎస్ఐసీయూ, కౌన్సెలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ౧ఉం౦ఔః అందించే అత్యాధునిక కిట్‌ల ద్వారా 12 రకాల డ్రగ్స్‌ను నిమిషాల్లోనే గుర్తిస్తున్నారు. బాధితులకు 6 వారాల పాటు పునరావాసం కల్పిస్తూ.. చట్టపరమైన నిబంధనల ప్రకారం చికిత్స అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే నార్కోటిక్ విభాగంతో పాటు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి మత్తుపై ఉత్తుపాదం మోపుతోంది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ.. గంజాయి, కొకైన్ ఇతర డ్రగ్స్ ముఠాలను కట్టడి చేస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా చోట్ల దాడులు నిర్వహించి పలువుర్ని అరెస్టు చేశారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం ఒక సామాజిక విపత్తుగా మారుతున్న తరుణంలో.. తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు.. అన్ని జిల్లాల్లోనూ ఏకకాలంలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు.తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఈ కేంద్రాల్లో మల్టీ-డ్రగ్ టెస్ట్ కిట్‌లను సరఫరా చేశారు. ఈ కిట్‌ల ద్వారా గంజాయి, ఓపియాయిడ్స్, కొకైన్, యాంఫెటమైన్స్ వంటి దాదాపు 12 రకాల మాదకద్రవ్యాలను మూత్ర పరీక్ష ద్వారా కేవలం నిమిషాల్లోనే గుర్తించవచ్చు. గాంధీ ఆసుపత్రి సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ కె. అనుపమ తెలిపిన వివరాల ప్రకారం.. కిట్‌లో ఎరుపు గీత కనిపించకపోతే సదరు వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారిస్తారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక పరీక్షలు మాత్రమే. అవసరమైతే మరిన్ని లోతైన క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తారు. గత రెండు రోజుల్లో 90 మందికి పరీక్షలు చేయగా.. సుమారు 40 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.తీవ్రమైన వ్యసనానికి గురైన వారు లేదా మత్తు పదార్థాలు అందక శారీరకంగా ఇబ్బంది పడే వారి కోసం సబ్‌స్టెన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఐసీయూ తరహాలోనే పనిచేస్తుంది. డ్రగ్స్ మానేయడం వల్ల వచ్చే ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితుల్లో రోగులను ఇక్కడ చేర్చుకుని నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. పోలీసులు తీసుకొచ్చే నిందితుల విషయంలో ప్రభుత్వం పక్కాగా నిబంధనలు అమలు చేస్తోంది.

నిందితులను పరీక్షల కోసం ఫారమ్ ంతో తీసుకొస్తారు. ఫలితాలను ఫారమ్ ఃలో నమోదు చేస్తారు. నిందితుడు చికిత్సకు అంగీకరిస్తే ఫారమ్ అ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ చేపడతారు.చికిత్స తర్వాత రోగులను డ్రగ్ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్స్‌కు పంపిస్తారు. ఇక్కడ ఆరు వారాల పాటు నిపుణుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్, ఫ్యామిలీ థెరపీ, నార్కోటిక్స్ అనానిమస్ వంటి గ్రూప్ సెషన్లు నిర్వహిస్తారు. వ్యసనం అనేది ఒక వ్యాధి అని దానిని చికిత్స ద్వారా నయం చేయవచ్చుని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది యువత తిరిగి సాధారణ జీవితం గడిపే అవకాశం కలుగుతుందని అంటున్నారు.

# 2028 నాటికి జిల్లాల పునరవ్యవస్థీకరణ

హైదరాబాద్, : రాష్ట్రంలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమా? లేక రాజకీయంగా పట్టు సాధించడమా? కారణం ఏదైనా తెలంగాణలో జిల్లాల సరిహద్దుల మార్పు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) చేసిన జిల్లాల విభజనలో లోపాలున్నాయని, శాస్త్రీయత లేదని భావించిన కాంగ్రెస్ సర్కార్, ఇప్పుడు సర్జరీకి సిద్ధమైంది. ఈ మార్పులు కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితమా? లేక కొత్త జిల్లాల ఏర్పాటుకు దారితీస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విభజనలో కొన్ని ప్రాంతాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం కలిపారని, దీనివల్ల ప్రజలకు దూరాభారం పెరిగిందని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. కేవలం జిల్లాల సంఖ్యను పెంచడం కాకుండా, భౌగోళికంగా, పరిపాలనా పరంగా ప్రజలకు దగ్గరగా ఉండేలా సరిహద్దులను సవరించడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటికే ఐఏఎస్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం, ఏ ఏ జిల్లాలను విడగొట్టాలి లేదా ఏ ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలపాలి అనే అంశంపై ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కావడంతో, నిబంధనల ప్రకారం.. జిల్లాల సరిహద్దులను మార్చడానికి వీలులేదు. ఈ ప్రక్రియ 2028 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన పదవీకాలం ముగిసేలోగా ఈ భారీ ఆపరేషన్ పూర్తి చేయాలని చూస్తోంది. దీనివల్ల రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి కొత్త జిల్లాల సెంటిమెంట్, ప్రజల ఆకాంక్షలను తమకు అనుకూలంగా మార్చుకోవచ్చనేది రాజకీయ వ్యూహం.కేవలం జిల్లాల సరిహద్దుల మార్పు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా అభివృద్ధి ఫలాలు క్షేత్ర స్థాయికి వేగంగా చేరుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల సెంటిమెంట్‌ను గౌరవిస్తూనే, పరిపాలనలో వస్తున్న ఇబ్బందులను తొలగించడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. జిల్లాల పునర్విభజన అనేది ఎప్పుడూ ఒక డబుల్ ఎడ్జ్ స్వార్డ్ (రెండంచుల కత్తి) లాంటిదే. ఒక ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించినప్పుడు వచ్చే మైలేజీ కంటే, కీలకమైన ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలిపినప్పుడు వచ్చే వ్యతిరేకత ఎక్కువగా ఉంటుంది. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈసారి అనాలోచితంగా కాకుండా, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టి, అఖిలపక్ష సమావేశాల ద్వారా ఏకాభిప్రాయం సాధించాలని చూస్తోంది. ఏది ఏమైనా, 2028 నాటికి తెలంగాణ రాజకీయ చిత్రపటం మరోసారి మారడం ఖాయంగా కనిపిస్తోంది.

# చెవిరెడ్డికి జగన్ మధ్య ఏమైంది..?



తిరుపతి, : నెల్లూరు పార్లమెంటు స్థానంలో వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అవకాశం కల్పించనున్నట్టు తెలుస్తోంది. పార్టీమెంటు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసే అంశంపై వైసీపీ అధినేత జగన్ పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో తన కుటుంబానికి అత్యంత విధేయుడిగా ఉన్న చెవిరెడ్డికి నెల్లూరు టికెట్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అయితే.. ఈ విషయంలో చెవిరెడ్డి విభేదిస్తున్నారని సమాచారం. తనకు అసెంబ్లీని యోజకవర్గం చాలని ఆయన కోరుతున్నట్టు తెలుస్తోంది.

గత ఎన్నికల్లోనే తాను పొరపాటు చేశానని తరచుగా చెవిరెడ్డి చెబుతున్నారు. అప్పట్లో ఒంగోలు నియోజక వర్గం నుంచి ఎంపీగా పోటీ చేశారు. వాస్తవానికిపార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు ఓటేయాలి. గత ఎన్నికలను గమనిస్తే.. వైసీపీ తరఫున పోటీ చేసిన నలుగురు మాత్రమే విజయం దక్కించుకున్నారు. ఈనలుగురు స్థానికంగా ఉన్న నాయకులే. పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారికి ప్రజలు తిరుగోమనం బాట పట్టించారు చిత్తూరు జిల్లాకు చెందిన చెవిరెడ్డి ఒంగోలులో పోటీ చేయడంతో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒంగోలు ప్రజలు స్థానిక నాయకుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డికే పెద్దపీట వేశారు. దీంతో చెవిరెడ్డి ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఇక, ఇప్పుడు కూడా ఆయనను నెల్లూరు జిల్లాకు బదిలీ చేయాలని భావిస్తుండడంతో ఆయన అధిష్టానంపై తొలిసారి ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది.

## ఏపీలో ఫ్రీహోల్డ్ భూములపై కీలక నిర్ణయం

రాజమండ్రి, : ఏపీలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించింది. ఈ మేరకు నేడే, రేపో ఉత్తర్వులు కూడా వచ్చే అవకాశం ఉ:ది. మిగిలిన భూములకు సంబంధించి త్వరలోనే సమావేశమై చర్చించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. త్వరలోనే ఈ ఫ్రీహోల్డ్ భూముల అంశంపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. భూముల సమస్యలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ అమరావతిలోని సచివాలయంలో సమావేశమైంది.. ప్రధానంగా ఫ్రీహోల్డ్ భూములు, 22ఏ, ఈనాం భూముల సమస్యపై చర్చించింది. ఫ్రీహోల్డ్ భూముల అంశంపై సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13.59 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయగా.. వీటిలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించాలనే నిర్ణయానికి వచ్చారు. మిగిలిన 5.74 లక్షల ఎకరాలపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానం చేశారు.

# సర్కారీ కొలువుల్లేకపోయినా.. భారీగా ఉద్యోగాలు

హైదరాబాద్,: ఆసక్తికర లెక్కలు వెలుగు చూశాయి. తెలంగాణ రాష్ట్రం కొలువులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. దేశ వ్యాప్తంగా ఉన్న ఐటీ కొలువులు మాత్రమే కాదు.. పారిశ్రామిక రంగాల విస్తరణతో పాటు.. కొత్త సంస్థలు కొలువు తీరటంతో పాటు.. సేవా రంగం భారీ ఎత్తున విస్తరిస్తున్న వేళ.. ఉపాధి కల్పనలో తెలంగాణ రాష్ట్రం దూసుకెళుతోంది. కాకి లెక్కలు కాకుండా.. ఉద్యోగులు ఎవరైనా సరే.. ఈపీఎఫ్ వో వద్ద నమోదయ్యే గణాంకాల ప్రకారం చూస్తే.. ఆశ్చర్యానికి గురి చేసే గణంకాలు తెర మీదకు వచ్చాయి. గడిచిన ఎనిమిది నెలల విషయాన్నే తీసుకుంటే.. దాదాపు 3.12 లక్షల మంది తొలిసారి ఉద్యోగాల్లో చేరినట్లుగా వెల్లడైంది. ఈ కొలువుల్లో అధిక నైపుణ్యం ఉన్న ఉద్యోగాలు మాత్రమే కాదు.. మధ్యస్థాయి కొలువులు సైతం గణనీయంగా పెరిగిన విషయం వెల్లడైంది. ఈ పెరిగిన కొలువుల్లో కీలకభూమిక పోషించింది మాత్రం హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాలే అని చెప్పాలి. ఈపీఎఫ్ వో గణాంకాల్ని పరిశీలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 55.42 లక్షల మంది పని చేస్తున్నట్లు తేలింది.ఇందులో ఒక్క హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాల్లోనే 42.8 లక్షలమంది ఉండటం గమనార్హం. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 31.39 లక్షల మంది ఉద్యోగులు ఉన్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలోని అత్యధిక ప్రాంతం ఈ రెండు జిల్లాల్లోనే ఉందన్న సంగతి తెలిసిందే. గడిచిన ఐదేళ్లలో దాదాపు 7.23 లక్షల మంది కొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చారు. రంగారెడ్డి జిల్లాలో4లక్షల ఉద్యోగాలు వచ్చాయి. అదే సమయంలో నిజామాబాద్.. ఆదిలాబాద్ జిల్లాల్లో మాత్రం ఉద్యోగుల సంఖ్య కాస్త తగ్గింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు మధ్యకాలం) కొత్తగా వచ్చిన ఉద్యోగాలు భారీగా వచ్చాయి. గడిచిన ఐదేళ్లలో వచ్చిన ఉద్యోగాల్లో దాదాపు 30 శాతానికి పైనే ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇదంతా చూస్తే.. హైదరాబాద్ కొలువులకు నెలవుగా మారటమే కాదు.. మహానగర స్థాయి ఏమిటన్న విషయాన్ని చెప్పకనే చెప్పేస్తుందని చెప్పాలి.

# మరో ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ

మహబూబ్ నగర్ : కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకానికి త్వరలోనే పర్యావరణ అనుమతులు లభించే అవకాశం ఉంది. రూ.4,885 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వికారాబాద్, నారాయణపేట జిల్లాలోని పలు మండలాలకు సాగు నీరు అందించనున్నారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నిర్మించ తలపెట్టిన కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే ఈ పథకానికి పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశం ఉంది. దీనికోసం రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ మదింపు మండలి హైదరాబాద్‌లో సోమవారం సమావేశమైంది. గతంలో జరిగిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికలను పరిశీలించి, ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే.. వికారాబాద్, నారాయణపేట జిల్లాల పరిధిలోని కోస్గి, నారాయణపేట, దౌల్తాబాద్,బొంరాస్‌పేట, కొడంగల్, ధన్వాడ, ఊట్కూరు, మక్తల్, మద్దూర్, దామరగిద్ద మండలాల్లోని భూములకు సాగు నీరందుతుంది. భూసేకరణలో భాగంగా ఎకరాకు గరిష్ఠంగా రూ. 20 లక్షల పరిహారం చెల్లించనున్నట్లు ఇంజినీర్లు సాఇఎంకు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 4,425 చెట్లను తొలగించాల్సి ఉంది. అలా తొలగించిన చెట్ల స్థానంలో కాలువలు, చెరువుకట్టలపై పదింతల చెట్లను పెంచుతామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ ఎత్తిపోతల పథకం కోసం రూ. 4,885 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత భారీ మొత్తంతో నిర్మిస్తున్న ఈ పథకంలో 209 మెగావాట్ల సామర్థ్యం గల పంపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పంపుహౌస్‌లు, ప్రెజర్ మెయిన్ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచి, పనులు అప్పగించింది. పర్యావరణ అనుమతులు మంజూరై, భూసేకరణ పూర్తయితే.. ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగుతాయి.డిసెంబర్ 8న కాలుష్య నియంత్రణ మండలి, నీటిపారుదల శాఖలు ఈ ప్రాజెక్టు పరిధిలోని రెండు ప్రాంతాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సభలు నిర్వహించాయి.ఆ నివేదికల ఆధారంగానే సాఇఎం సమావేశం జరిగింది. ఇంజినీర్ల అంచనా ప్రకారం, కొద్దిరోజుల్లోనే పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశాలున్నాయి. ఆ వెంటనే భూసేకరణ జరిపి.. పనులు వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# 3 జిల్లాలో 6 అర్బన్ ఫారెస్టులు

హైదరాబాద్, : తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 'నగర్ వన్ యోజన' కింద రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో 6 అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వీటి అభివృద్ధికి రూ. 8.26 కోట్లు మంజూరు చేసింది. పట్టణాల్లో పచ్చదనం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. కాగా, పట్టణాల్లో ఏర్పాటు చేయబోయే ఈ వనాలల్లో స్థానిక వృక్ష జాతులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలంగాణ అటవీ శాఖ అధికారులు తెలిపారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. తెలంగాణలోని మూడు జిల్లాల్లో 6 అర్బన్ ఫారెస్ట్‌లు అభివృద్ధి చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు 'నగర్ వన్ యోజన' కింద రాష్ట్రానికి రూ. 8.26 కోట్లు మంజూరు చేసింది. అర్బన్ ఫారెస్టుల ఏర్పాటకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. అందులో భాగంగా తొలివిడతలో 70 శాతం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు తెలంగాణ అటవీ శాఖ అధికారులు వివరాలు వెల్లడించారు.పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం.. నగర్ వన్ యోజన పథకాన్ని 2020 జూన్ 5న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. పట్టణాల పరిధిలో అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు ద్వారా.. పర్యావరణ సమతుల్యత కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, మొదటి ఐదేళ్లలో 200 పట్టణాల్లో అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకుంది. ఇప్పుడు 1000 నగరాల్లో వీటిని అభివృద్ధి చేయాలని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగా తాజాగా తెలంగాణలో 6 అర్బన్ ఫారెస్టులకు ఆమోదం తెలిపింది.మరోవైపు, పట్టణాల్లో నగర్ వన్ యోజన కింద ఏర్పాటయ్యే అర్బన్ ఫారెస్ట్‌లల్లో.. స్థానిక వృక్ష జాతికి చెందిన మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అటవీ



శాఖ అధికారులు తెలిపారు. ఇవి అర్బన్ ప్రజలకు ప్రకృతిలో గడిపిన అనుభూతిని అందిస్తాయని చెప్పారు. ఈ పట్టణ వనాల్లో వాకింగ్ ట్రాక్‌లు, విశ్రాంతి కేంద్రాలు, పచ్చని మైదానాలు ఏర్పాటు చేయనున్నారు.ఆదిలాబాద్, మంచిర్యాల, మేడ్చల్- మల్కాజ్‌గిర్ జిల్లాలో ఈ 6 అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మావళా, యాపల్‌గూడ?ఎఎ పట్టణాల్లో అర్బన్ ఫారెస్టులు ఏర్పాటు కానున్నాయి. ఇక మంచిర్యాల జిల్లాలో ఇందారం (క్యాతనపల్లి మండలం), చెన్నూర్‌లలో ఏర్పాటు చేస్తారు. మేడ్చల్ ?మల్కాజ్‌గిరి జిల్లాలో యెల్లంపేట, చెంగిచెర్లలో పట్టణ వనాలు అభివృద్ధి చేయనున్నారు.మరోవైపు, తెలంగాణలో 9 జిల్లాల్లోని మున్సిపాలిటీల పరిధిలో.. 14 అర్బన్ ఫారెస్టులను ఏర్పాటు చేయనున్నట్లు 2025 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో పార్కుకు రూ. 2 కోట్ల చొప్పున.. రూ. 28 కోట్లను కేటాయించింది. తాజాగా మూడు జిల్లాలో ఆరు పట్టణ వనాలకు నిధులు విడుదల చేసింది. మిగతా వికారాబాద్ (4), భూపాలపల్లి (1),కొత్తగూడెం (1), జగిత్యాల (1), పెద్దపల్లి (1) జిల్లాలోని పట్టణ వనాలకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

# బొంద రాజకీయాలు..!

హైదరాబాద్,: తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం "బొంద పెట్టాలి" అనే పదం చుట్టూ పెద్ద దుమారమే రేగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి బీఆర్ఎస్ ఇస్తున్న కౌంటర్లు ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్ అయ్యాయి. ఖమ్మం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ఒకప్పుడు తాను పెరిగిన తెలుగుదేశం పార్టీని తెలంగాణలో నామరూపాలు లేకుండా చేసిన కేసీఆర్‌పై రేవంత్ తన కసిని వెళ్లగక్కారు. అయితే, దీనికి బీఆర్ఎస్ ఇస్తున్న రిటార్ట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయినప్పటికీ, ఆయన రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచే మొదలైంది. తెలంగాణలో నేడు టీడీపీకి బలమైన నాయకత్వం లేకపోయినా, క్షేత్రస్థాయిలో ఆ పార్టీ సానుభూతిపరులు, కేడర్ ఇంకా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ పోటీకి దూరంగా ఉండటంతో,ఆ ఓటు బ్యాంకులో మెజారిటీ కాంగ్రెస్‌కు మళ్లినట్లు విశ్లేషణలు ఉన్నాయి. ఏపీలో చంద్రబాబుకు వ్యతిరేకంగా కేసీఆర్, జగన్ చేతులు కలిపారనే భావన టీడీపీ అభిమానుల్లో బలంగా ఉంది. దీనిని క్యాష్ చేసుకునేందుకే రేవంత్ రెడ్డి "టీడీపీని దెబ్బతీసిన కేసీఆర్‌ను, ఆయన బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలి" అంటూ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు.రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అగ్రనేతలు తీవ్రంగా స్పందిస్తూ ఒక చారిత్రక కోణాన్ని ముందుకు తెచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే కాంగ్రెస్ వ్యతిరేక భావజాలంపైన..! ఎన్టీఆర్ తన జీవితాంతం కాంగ్రెస్ అరాచక పాలనపైనే పోరాడారు. "ఎన్టీఆర్ ఆత్మ శాంతించాలంటే ఆయన బద్ధశత్రువైన కాంగ్రెస్‌నే బొంద పెట్టాలి కానీ, ఆయన శిష్యుడైన కేసీఆర్‌ను కాదు" అనేది బీఆర్ఎస్ వాదన. రేవంత్ రెడ్డి ఇప్పటికీ టీడీపీ ఏజెంట్‌గా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్లు ఈ వ్యవహారంపై సెటైర్ల వర్షం కురిపిస్తున్నారు. ఒకవైపు రేవంత్ ఏమో బీఆర్ఎస్ ను బొంద పెట్టాలంటున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఏమో కాంగ్రెస్ ను బొంద పెట్టాలంటోంది. మరికొందరు నెటిజన్లు "అసలు ఒకప్పుడు టీడీపీలో కలిసి పనిచేసిన రేవంత్, కేసీఆర్.. ఇప్పుడు ఒకరినొకరు బొంద పెట్టుకుంటామనడం విడ్డూరంగా ఉంది" అని కామెంట్ చేస్తున్నారు.తెలంగాణలో టీడీపీ ఉనికి కోల్పోవడానికి కేసీఆర్ ఆపరేషన్ ఆకర్ష్ ప్రధాన కారణం అనడంలో సందేహం లేదు. ఓటుకు నోటు కేసు తర్వాత చంద్రబాబు ఏపీకి పరిమితం కావడం, ఇక్కడి నేతలంతా బీఆర్ఎస్ లో చేరిపోవడం చకచకా జరిగిపోయాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి పిలుపుతో పాత టీడీపీ శ్రేణులు ఆలోచనలో పడ్డాయి. అయితే, రేవంత్ కాంగ్రెస్ లో ఉండి టీడీపీ గురించి మాట్లాడటాన్ని కొంతమంది కాంగ్రెస్ విధేయులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు.తెలంగాణలో ఇప్పుడు పాత కక్షలు, పార్టీల మనుగడ చుట్టూ తిరుగుతోంది. రేవంత్ రెడ్డి తన 'టీడీపీ మూలాలను' వాడుకొని బీఆర్ఎస్ ను దెబ్బతీయాలని చూస్తుంటే, బీఆర్ఎస్ అదే 'ఎన్టీఆర్ సెంటిమెంట్'తో రేవంత్ ను ఇరకాటంలో పెట్టాలని చూస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ 'బొంద' రాజకీయం ఎవరికి లాభిస్తుందో చూడాలి.

# అమ్రాబాద్‌లో కొత్త అడ్వెంచర్

మహబూబ్ నగర్, : వన్యప్రాణి, ప్రకృతి ప్రేమికులకు తెలంగాణ అటవీ శాఖ తీపి కబురు అందించింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో త్వరలోనే 20 కిలోమీటర్ల సరికొత్త 'కొల్లాం' సఫారీ మార్గాన్ని ప్రారంభించనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు. ఇందుకోసం రహదారి పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ప్రస్తుతం అమ్రాబాద్‌లో మూడు రకాల సఫారీలు అందుబాటులో ఉన్నాయి. ఫరాహాబాద్ సఫారీ మె?త్తం 16 కి.మీ. ప్రయాణం కాగా... 7 సీట్ల వాహనానికి రూ. 3 వేలు ఛార్జ్ చేస్తున్నారు. గుండం సఫారీ దట్టమైన అడవిలో 35 కి.మీ. ప్రయాణం కాగా..వాహనానికి రూ. 5 వేలు, అక్కమహాదేవి గుహల సఫారీ 14 కి.మీ ప్రకృతి అందాల మధ్య ప్రయాణానికి.. 5 సీట్ల వాహనానికి రూ. 3 వేలు వసూలు చేస్తున్నారు.ఈ సఫారీ కార్యకలాపాలన్నీ కూడా స్థానిక చెంచు గిరిజనులే నిర్వహిస్తున్నారు. మొత్తం 18 సఫారీ వాహనాలకు వారే డ్రైవర్లుగా, నేచర్ గైడ్‌లుగా వ్యవహరిస్తూ పర్యాటకులకు అడవి గురించి వివరిస్తారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని నేరుగా 'టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్'కు, గిరిజనుల జీవనోపాధికి మళ్లిస్తున్నారు. పర్యావరణానికి హాని కలగకుండా టైగర్ రిజర్వ్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఫరాహాబాద్ వ్యూ పాయింట్, గుండం, దోమలపెంట వంటి ప్రాంతాల్లో బయో-టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు పర్యాటకులు రాకపోకలు సాగించే చోట స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించారు. వన్యప్రాణుల కోసం అడవి లోపల సోలార్ బోర్ వెల్స్, నీటి కుంటలను నిర్వహిస్తున్నారు. 2025 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు దాదాపు 50 సార్లు పులులు పర్యాటకులకు కనిపించడం ఇక్కడి అడవి ఆరోగ్యాన్ని సూచిస్తోంది.దేశవ్యాప్తంగా జరుగుతున్న 'ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026' (పులుల గణన) కారణంగా జనవరి 20 నుంచి 25 వరకు అమ్రాబాద్‌లో సఫారీ కార్యకలాపాలను నిలిపివేశారు. ఈ పులుల గణన కార్యక్రమంలో మె?త్తం 139 మంది అటవీ సిబ్బందితో పాటు 170 మంది వాలంటీర్లు పాల్గొంటున్నారు.

# సమగ్ర శాసనం కోసం



రాష్ట్రంలో 1930వ దశాబ్దం ప్రారంభం నుండి పారిశ్రామికాభివృద్ధి క్రమంగా వేగం పుంజుకుంది. పరిశ్రమల సంఖ్యతో పాటే కార్మికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అయితే, దీనికి తగ్గట్టుగా కార్మికుల రక్షణకు సమగ్రచట్టాలు లేవు. ఫ్యాక్టరీ యాక్టు వంటి ఒకటి, రెండు చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలైన దాఖలాలు రాష్ట్రంలో ఎక్కడా లేవు. వేతనాల నుండి పని ప్రదేశాల్లో భద్రత వరకు ఒక్క అంశం కూడా అమలులోకి రాకపోవడంతో కార్మికుల పరిస్థితి ఘోరంగా మారింది. దీంతో కార్మికులను సంఘటితం చేసి,వారి హక్కుల పరిరక్షణ కోసం సమగ్ర శాసనం రూపొందించాలన్న డిమాండ్ ప్రారంభమైంది. సహజంగానే కమ్యూనిస్టు పార్టీ ఈ కృషిని భుజాన వేసుకుంది. కార్మికుల్లో విస్తృతంగా ప్రచారాన్ని ప్రారంభించింది. కార్మికులకు భద్రత, కనీస సౌకర్యాలు, హక్కులు, ఉద్యోగ భద్రత, పనిగంటలు, కార్మిక సంఘాలు ఏర్పాటుచేసుకునే హక్కు తదితర అంశాలను ఈ శాసనం చేర్చాలంటూ కమ్యూనిస్టులు చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. దీంతో 1937లో మద్రాసు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చన కాంగ్రెస్ మంత్రివర్గం కార్మిక సమస్యలపై తన ఆలోచనలను తెలియచేస్తూ ఒక ప్రకటన చేసింది. కార్మిక వివాదాల్లో ఇరు పక్షాల మధ్య రాజీ కుదర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దీనిలో పేర్కొన్నారు. అదే సమయంలో కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియచేయాలని, సంప్రదింపులకు అవకాశం ఇవ్వాలని, తక్షణమే ప్రత్యక్ష ఆందోళనలకు దిగకూడదని కూడా సూచించింది. అయితే, ఈ ప్రకటన కార్మికులకు ఎటువంటి ఊరట ఇవ్వలేకపోయింది. యజమానులు కూడా ప్రభుత్వ ప్రకటనను ఖాతరు చేయకుండా కార్మికులను దోపిడి చేసేందుకే ప్రయత్నించారు. అనేక చోట్ల కార్మిక సంఘాలను సైతం గుర్తించలేదు. దీంతో కార్మికుల ఆందోళనలు తీవ్రమయ్యాయి. కాంగ్రెస్ నాయకులు ఎక్కడికెళ్లినా ఈ చట్టం గురించే కార్మికులు ప్రశ్నించేవారు. ఈ పరిస్థితుల్లో కార్మిక శాసనం రూపొందించడానికి మద్రాసు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అప్పటికే ఉనికిలో ఉన్న వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు చర్చించుకుని విశాల ప్రాతిపదికన ఒక నివేదికను రూపొందించారు. 1939 మే 12న అప్పటి కార్మిక మంత్రి వివి గిరిని కలుసుకుని ఆ నివేదికను అందచేశారు. ఆ నివేదికలోని అంశాలను శాసనంలో పొందుపర్చాలని కోరారు. ఎనిమిది గంటల పనిదినం, వృద్ధాప్యం, అనారోగ్యం, అనాథ స్థితిలో ఉన్న కార్మికులకు జీవనోపాధి ఏర్పాటు చేయాలని, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు పని షరతులను నిర్ధారించాలని, షాపు, అసిస్టెంట్ సర్వీసు షరతులను న్యాయ సమ్మతంగా అమలు చేయాలన్నవి తక్షణ డిమాండ్లుగా ఈ నివేదికలో పేర్కొన్నారు.

# సొంత ఆయిల్ ఉత్పత్తిపై భారత్ దృష్టి



న్యూఢిల్లీ,: భారత్ ప్రపంచంలో చమురు వినియోగ దేశాల్లో రెండోస్థానంలో ఉంది. మొదటిస్థానంలో చైనా ఉంది. భారత్ 90 శాతం చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్?రష్యా యుద్ధంతో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యా ఆయిల్ దిగుమతులు నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో మిత్రదేశమైన రష్యాకు భారత్ అండగా నిలిచింది. మరోవైపు రష్య కూడా బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకు ఇంధనం సరఫరా చేస్తోంది. అయితే దీనిని అమెరికా జీర్ణించుకోవడం లేదు. ఈ కరణంగానే అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఇంకా విధిస్తామని బెదిరిస్తున్నాడు. మరోవైపు వెనుజువెలా ఆక్రమణ నేపథ్యంలో రష్యాలోని షెల్ ఆయిల్‌ను భారత్‌కు సరఫరా చేయాలని ప్లాన్ వేస్తున్నాడు. ఈ క్రమంలో భారత్ వైవిధ్యమైన మార్గాలు అన్వేషిస్తోంది. ఇంధన భద్రతను బలోపేతం చేస్తోంది. తాజాగా యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ పర్యటన సందర్భంగా మోదీతో కీలక చర్చలు జరిపారువెనెజువెలాలోని 'సాన్ క్రిస్టోబల్' ప్రాజెక్టుల్లో ఓఎన్జీసీకి పెద్ద వాటాలు ఉన్నాయి. 600 మిలియన్ డాలర్ల లాభాలు చమురు రూపంలో అందుతాయి. కానీ అక్కడి ముదురో ప్రభుత్వం కూలిపోవడంతో ఇప్పుడు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు గయానాలో 11 బిలియన్ బ్యారెళ్ల నిల్వల్లో ఓఎన్జీసీ, రిలయన్స్ 2026 వేలంలో పాల్గొని ఉత్పత్తి హక్కులు సాధించబోతున్నాయిరష్యాలో ఓఎన్జీసీకి సాఖాలిన్?1లో 20%, వాంకోర్ క్షేత్రంలో 26% వాటాలు. 2009లో టామ్స్క్ ప్రాంతంలో ఇంపీరియల్ ఎనర్జీని పూర్తిగా స్వాధీనం చేసుకుంది. ఈ ప్రాజెక్టులు భారత ఇంధన అవసరాలకు స్థిరమైన మద్దతు.అబుదాబిలో బీపీసీఎల్, ఐవోసీ కలిసి ః ఉర్జా భారత్' సంస్థ ఆన్‌షోర్ బ్లాక్?1లో చమురు కనుగొన్నాయి. తాజాగా ఎక్స్ఎన్?76 (షిలైఫ్) బావిలో తేలిక ముడి చమురు, ఎక్స్ఎన్?79 (హబ్షాన్)లో కొత్త నిక్షేపాలు లభించాయి. 6,162 చ.కి.మీ. విస్తీర్ణంలో 100% హక్కులతో పూర్తి ఉత్పత్తి అనుమతి. 2019 నుంచి సాగుతున్న అన్వేషణ దశ ముగిసి, భారీ పెట్టుబడులతో తవ్వకాలు మొదలయ్యాయి. యూఏఈ ఇంధన ఉత్పత్తిలో కూడా ఇప్పుడు భారత్‌కు అతిపెద్ద భాగస్వామిగా మారింది.సౌదీ సరఫరాలు, రష్యా?వెనెజువెలా?గయానా ప్రాజెక్టులు, అబుదాబి ఉత్పత్తి ? ఇవి భారతాన్ని దిగుమత ఆధారాల నుంచి స్వావలంబన వైపు నడిపిస్తున్నాయి. అమెరికా ఒత్తిడికి భారత్ స్వయం సమృద్ధి మార్గం ఎంపిక చేసుకుంది.

# పెద్దిరెడ్డికి బౌండరీస్..

తిరుపతి, : అధికారంలో ఉన్నప్పుడు అన్నీ కలిసి వస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నేతల బలాలు తెలుస్తాయి. ఇప్పుడు సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిస్థితి అదే. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆయన రాయలసీమకు ముఖ్యమంత్రిగా వ్యవహరించేవారు. రాయలసీమ పరిధిలోని నాలుగు జిల్లాలు ఆయన కంట్రోల్లో ఉండేవి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సీనియర్ కావడం.. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డికి సన్నిహితుడు కావడంతో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు రామచంద్రారెడ్డి. చంద్రబాబుకు సమకాలీకుడు కావడంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తన చెంత ఉంచుకున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. 2014లో రాయలసీమలో వైసీపీ హవా నడిచింది. 2019లో క్లీన్ స్వీప్ చేసింది. అంతవరకు ఓకే కానీ.. 2024 ఎన్నిక ల్లో అదే రాయలసీమలో ఏడు స్థానాలకు పడిపోయింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. దీంతో అదంతా హవా తప్ప పెద్దిరెడ్డి లాంటి సీనియర్ల ప్రమేయం లేదన్న నిర్ధారణకు వస్తున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు.సొంత జిల్లా చిత్తూరులోపెద్దిరెడ్డి కంట్రోల్లో ఉండేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడ భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్కే రోజా లాంటి నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. పెద్దిరెడ్డి పెద్దరికాన్ని అయిష్టంగానే గౌరవించేవారు. దానికి కారణం జగన్మోహన్ రెడ్డితో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం. అయితే ఇప్పుడు మాత్రం సీన్ మారింది. ముఖ్యంగా నగరి నియోజకవర్గ విషయంలో రోజా పట్టు బిగిస్తున్నారు. తన నియోజకవర్గంలో పెద్దిరెడ్డి మనుషుల పెత్తనాన్ని సహించుకోలేకపోయారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయేది. కానీ ఇప్పుడు మాత్రం పెద్దిరెడ్డి ప్రమేయాన్ని ఎంత మాత్రం సహించడం లేదు. పెద్దిరెడ్డి మనుషులను పార్టీ నుంచి బయటకు పంపుతారా? లేకుంటే తానే వెళ్లిపోమంటారా అంటూ రోజా గట్టిగానే హెచ్చరించినట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫుల్ సైలెన్స్ పాటిస్తున్నారు. భూమన కరుణాకర్ రెడ్డి తో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి జగన్ వద్ద ప్రాధాన్యత లభిస్తున్నట్లు సమాచారం. చెవిరెడ్డి అరెస్టు జరిగిన తర్వాత ఏ నేతకు లేనంత ప్రాధాన్యత ఆయనకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అసలు జైలుకెళ్లిన పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని జగన్ కలుసుకునేందుకు కూడా ఇష్టపడలేదట.

# సీబీఐ కీలకం

కడప, : వైఎస్ వివేకానంద రెడ్డిహత్య కేసు మరోసారి తెరపైకి వచ్చింది.. సిబిఐ ఇప్పటికే విచారణ పూర్తి చేసినట్లు చెప్పిన నేపథ్యంలో కొన్ని రకాల అనుమానాలు వ్యక్తం చేస్తూ వైయస్ సునీత ఇదే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ట్రయల్ కోర్టులో పిటిషన్ వేయాలని సూచించడంతో ఆమె కింది కోర్టును ఆశ్రయిం చారు. అయితే ఆమె లేవనెత్తిన అనుమానాలు, ఆపై నిందితులుగా భావిస్తున్న వారిని విచారించకుండానే సిబిఐ దర్యాప్తు పూర్తి అవ్వడాన్ని ప్రస్తావించారు. కానీ కింది కోర్టు అవేవీ పరిగణలోకి తీసుకోలేదు. దీంతో మళ్లీ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈరోజు విచారణ జరగగా కోర్టు ఆసక్తికరమైన అంశాలను సిబిఐ ని అడిగి తెలుసుకుంది. వచ్చేనెల ఐదుకు విచారణను వాయిదా వేసింది. ప్రధానంగా ఈ కేసులో దర్యాప్తు పూర్తిస్థాయిలో ముగిసింది అని సిబిఐ కోర్టుకు చెబితే.. సుప్రీంకోర్టు ఈ కేసును ఒక కొలిక్కి తెచ్చే అవకాశం ఉంది. సిబిఐ దర్యాప్తు పూర్తిగా జరిగిందా? ఇంకేమైనా దర్యాప్తు చేయాల్సి ఉందా? అని అడిగింది కోర్టు. అయితే సునీత మాత్రం జగన్మోహన్ రెడ్డి దంపతులకు ముందుగానే ఎలా తెలిసింది అనేది సందేహం వ్యక్తం చేస్తూ వచ్చారు. అదే కీ పాయింట్ అని చెప్పుకొచ్చారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్యకు గురయ్యారని జగన్మోహన్ రెడ్డి దంపతులకు ఎవరు చెప్పారు అన్నది సునీత సందేహం. రాజకీయ కోణంలోనే ఈ హత్య జరిగిందని ఆమె ఆది నుంచి సందేహంవ్యక్తం చేస్తూవచ్చారు. అయితేసుప్రీంకోర్టు ఆదేశాలతో ట్రైల్ కోర్టుకు సునీతరాగా.. అందరూ కుటుంబ సభ్యులు కావడం వల్లే సమాచారం ఇచ్చి ఉంటారని కోర్టు అభిప్రాయ పడింది.

అయితే దీనితో ఏకీభవించలేదు సునీత. అందుకే మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు సుప్రీంకోర్టు సిబిఐ అభిప్రాయం అడిగింది. అంటే వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక ఘట్టం ఆసన్నం అయిం దన్నమాట. ఇప్పుడు సిబిఐ తన మనసులో ఉన్న మాటను కచ్చితంగా చెప్పాల్సిందే. సీరియస్ గా విచారణ చేపట్టామని చెప్పాలి. లేకుంటే కొంతమందినివిచారణ చేయాల్సి ఉందని చెప్పాలి. కానీ ఏదో ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పాలి. అప్పుడే అత్యున్నత న్యాయస్థా నం సంచలన తీర్పు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ సిబిఐ మళ్లీ దర్యాప్తును కోరితే మాత్రం అత్యున్నత న్యాయస్థానం సమ్మతించే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు సిబిఐ ఏమి చెబుతోం ది అనేది హాట్ టాపిక్. ఆ విషయం వచ్చే నెల 5న తేలనుంది.



# అనేక వ్యాధులను తగ్గించే ఈ మొక్క..

## మన ఇంటి చుట్టూనే పెరుగుతుంది.. కనిపిస్తే వదలకండి..


మన వంట ఇంటి పోపు దినుసుల్లో వాము కూడా ఒకటి. ఇది ఎంతో సువాసనను కలిగి ఉంటుంది. దీన్ని కూరల్లో వేస్తే మంచి రుచి, వాసన వస్తాయి. అయితే కేవలం వాము గింజలు మాత్రమే కాదు, మనకు వాము ఆకులు కూడా లభిస్తాయి. ఈ మొక్క చాలా మంది ఇళ్లలో పెరుగుతూనే ఉంటుంది. కానీ దీన్ని వాము ఆకు మొక్క అనిఎవరూ గుర్తు పట్టి ఉండరు. ఈ మొక్క ఆకులను కూడా మనం పలు వ్యాధులను తగ్గించేందుకు ఉపయోగించవచ్చు. వాము ఆకుల్లో అద్భుతమైన ఔషధగుణాలు ఉంటాయనిఆయుర్వేదం చెబుతోంది. దీంతో అనేకలాభాలు పొందవచ్చునివైద్యులు అంటున్నారు.

జీర్ణ సమస్యలకు..:వాము ఆకులను నేరుగా అలాగే నమిలి తినవచ్చు. దీంతో పొట్టలో ఉండే అసౌకర్యం తగ్గుతుంది. కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము ఆకుల్లో థైమోల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణాశయ ఎంజైమ్‌లు, జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము ఆకులను తినడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. కొందరు ఆహారం అతిగా తింటారు. దీంతో బరువు పెరుగుతారు. అయితే ఈ సమస్య నుంచి బయట పడాలంటే వాము ఆకులను రోజూ నమిలి తింటుండాలి. దీంతో ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. వాము ఆకులను నమలడం వల్ల అతిగా తినడం అనే సమస్య తగ్గుతుంది. బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు ఈ ఆకులను తింటుంటే ఫలితం ఉంటుంది.

శ్వాసకోశ సమస్యలకు..: వాము ఆకులు దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. గొంతు, ఊపిరితిత్తులలో ఉండే కఫాన్ని కరిగిస్తాయి. దీంతో ఊపిరితిత్తులకు గాలి సరిగ్గా లభిస్తుంది. శ్వాసనాళాలు క్లియర్ అవుతాయి. శ్వాసకోశ సమస్యల నుంచి బయట పడవచ్చు.గొంతులో గరగర,నొప్పి, మంట ఉన్నవారు వాము ఆకులను నీటిలో వేసి మరిగించి తాగుతుంటే ఫలితం ఉంటుంది. ఆస్తమా ఉన్నవారు ఈ నీళ్లను తాగుతుంటే సత్వరమే ఉపశమనం లభిస్తుంది. వాము ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కనుక ఈ ఆకులను నోట్లో వేసుకుని నమిలి తింటుంటేనోట్లోని బ్యాక్టీరియా నశిస్తుంది.దీంతోనోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. నోటి సమస్యలు కూడా తగ్గుతాయి. నోట్లోని పుండ్లు నయమవుతాయి.

ఆర్థరైటిస్‌నొప్పులకు..:వాయు ఆకుల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. వాము ఆకులను మొటిమలను తగ్గించేందుకు కూడా ఉపయోగించవచ్చు. ఈ ఆకులను మెత్తని పేస్టులాచేసి ముఖానికి రాస్తుంటే ముఖంపై ఉండే మొటిమలు, ముడతలు,మచ్చలు పోతాయి. ముఖం కాంతి వంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. శిరోజాల సంరక్షణకు కూడా ఈ ఆకులను ఉపయోగించవచ్చు. ఈ ఆకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు శిరోజాలను సంరక్షిస్తాయి. చుండ్రు, దురద వంటి సమస్యలను తగ్గిస్తాయి. జుట్టు ఒత్తుగా, దృఢంగాపెరిగేలా చేస్తాయి.వాము ఆకుల్లోయాంటీ ఆక్సిడెం ట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీంతో బ్యాక్టీరియా, వైరస్ ఇన్ఫెక్షన్ల నుంచి సురక్షితంగా ఉండవచ్చు. ఇలా వాము ఆకులను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# మంచినిద్రతో మేధాశక్తి




రాత్రిళ్లు తొందరగా, ఎక్కువసేపు పడుకొంటే టీనేజీ వయసువాళ్ల మెదడు పదునెక్కుతుందట. కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ విషయాన్ని కనుక్కొన్నారు. త్వరగా పడుకొని, ఎక్కువసేపు నిద్రించిన వాళ్లతో పోలిస్తే మిగిలిన వాళ్లు.. లెక్కలు చేయడం, పదజాలం, చదవడం లాంటి మేధాశక్తికి సంబంధించిన పరీక్షల్లో చాలా వెనకబడ్డారని ఈ పరిశోధనలో తేలింది. "నిద్రించే సమయంలో మనం జ్ఞాపకాలను సంఘటితం చేసుకుంటాం కాబట్టి, నిద్ర మనమెదడు సామర్థ్యాన్ని పెంచుతుంది" అని ఈ అధ్యయన బృంద నాయకుడు బార్బరా సహాకియాన్ వెల్లడించారు. కాబట్టి, పిల్లల నిద్రించే వేళలు, నిద్రలో నాణ్యత విషయంలో పెద్దలు తగినంత శ్రద్ధ తీసుకోవాలి. అప్పుడే వాళ్లు జీవితంలో రాణిస్తారు.

## చారి ట్రబల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే సహాయం

కొడిమ్యాల: చొప్పదండి ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం చారి ట్రబల్ ట్రస్ట్ ద్వారా పేదరికం ఉన్నవారిని ఆదుకుంటూ అభిమానాన్ని చూరగొంటున్నారు. రూపదేవి చారి ట్రబల్ ట్రస్ట్ పేరుతో చొప్పదండి నియోజక వర్గంలో ఎక్కడ ఆపద వచ్చిన వారి దగ్గరికి వెళ్లి ఆదు కుంటున్నారు. ఎవరుఫోన్ చేసిన స్పందిస్తున్నారు. సమస్యల పై దృష్టిపెడుతూ నియోజక వర్గం అంతా సభలు సమావేశాల్లో పాల్గొంటూ చురుకుగా పనిచేస్తున్నారు. అధికారులులతో పారదర్శకంగా పనులు చేయిస్తున్నారు.గతంలోనే రాజీవ్ యువ వికాస్ ధరఖాస్తులు పార దర్శకంగా పనిచెయ్యాలని అధికారులకు సూచించారు. కొండగట్టు ఏర్పాట్లను పరి శీలించి చిన్న హనుమాన్, పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి ఏర్పాట్లను పరి శీలించి విజయం సాదించారు. వరికోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు సహాయం అందిస్తూ తన మార్క్ చూపిస్తున్నారు.

## మీ ఇంటి చుట్టు పక్కల మర్రి చెట్టు ఉందా..

# అందులోని ప్రతి భాగమూ ఉపయోగకరమే..!



పూర్వ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఏదో ఒక భారీవృక్షం కనిపిస్తూనే ఉండేది. ముఖ్యంగా మర్రి చెట్లు మనకు ఎక్కువగా కనిపించేవి. కానీ ఇప్పుడు వాటి సంఖ్య బాగా తగ్గిపోయింది. చూద్దామంటే అసలు ఈ చెట్లు కనిపించడం లేదు. అయితే మర్రి చెట్టు మనక నీడను మాత్రమే కాదు,


ఆరోగ్యాన్ని కూడా అందిస్తుంది. ఆయుర్వేదంలో మర్రి చెట్టుకు ఎంతో ప్రాధాన్యతను కల్పించారు. మర్రి చెట్టుకు చెందిన అన్ని భాగాలు మనకు ఏదో ఒక విధంగా ఉపయోగపడతాయి. మర్రి మెరడు, ఆకులు, వేళ్లు, ఊడలు అన్నీ మనకు ఉపయోగపడేవే. ఈ క్రమంలోనే ఆయా భాగాలతో అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది.

డయాబెటిస్ అదుపులో..: మర్రి చెట్టు ఆకులు, బెరడులో యాస్ట్రింజెంట్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ ఆకులు లేదా బెరడను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుంటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. మర్రి చెట్టు ఆకులను ఉపయోగించడం వల్ల పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. మలబద్దకం తగ్గుతుంది. పొట్టలో అసౌకర్యంగా ఉన్నవారు కూడా మర్రి చెట్టు ఆకులను తీసుకుని వాటితో కషాయం తయారు చేసి తాగుతుంటే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. షుగర్ ఉన్నవారికి మర్రి చెట్టును వరంగా చెప్పవచ్చు. మర్రి చెట్టు బెరడు ఇందుకు చక్కగా పనిచేస్తుంది. దీంట్లో హైపోగ్లైసీమిక్ గుణాలు ఉంటాయి. అంటే ఇది షుగర్ లెవల్స్‌ను గణనీయంగా తగ్గిస్తుందన్నమాట. మర్రి బెరడును నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను సేవిస్తుంటే డయాబెటిస్ తగ్గుతుంది. మర్రి బెరడులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరం ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను కణాలు సరిగ్గా శోషించుకునేందుకు పనిచేస్తాయి. దీంతో షుగర్ లెవల్స్ తగ్గి డయాబెటిస్ అదుపులో ఉంటుంది.

దంతాలు, నోరు, చిగుళ్ల సమస్యలకు..: మర్రి చెట్టు ఆకులను నేరుగా అలాగే నమిలి కాసేపు అయ్యాక ఉమ్మేయాలి. ఇలా చేస్తుంటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. ముఖ్యంగా పుచ్చిపోయిన దంతాలు ఉన్నవారు, చిగుళ్ల నుంచి రక్తం కారుతున్న వారు ఈ చిట్కాను పాటిస్తే ఫలితం ఉంటుంది. నోట్లో ఉండే పొక్కులు, పుండ్లను తగ్గించడంలోనూ మర్రి ఆకులు, బెరడు ఎంతగానోఉపయోగపడతాయి.మర్రి బెరడులోయాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. మర్రి బెరడును కాస్త పొడి చేసి అందులో కొద్దిగా నీళ్లను పోసి మెత్తని పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పూట ఆర్థరైటిస్ నొప్పులు ఉన్న చోట రాయాలి. ఇలా రోజూ చేస్తుంటే కొన్ని రోజులకు ఆర్థరైటిస్ నుంచి విముక్తి లభిస్తుంది. అలాగే శరీరంలో ఇతర చోట్లలో ఉండే నొప్పులు కూడా తగ్గిపోతాయి.

చర్మ సమస్యలకు..: మర్రి ఆకుల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ ఆకులు అనేక చర్మ సమస్యలను తగ్గిస్తాయి. ముఖ్యంగా తామర, గజ్జి, ఇతర చర్మ ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. మర్రి ఆకుల పేస్ట్ లేదా బెరడు పొడి, నీటి మిశ్రమాన్ని రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా మానిపోతాయి. సూర్య కాంతి వల్ల చర్మం కందిపోయినా కూడా మర్రి ఆకుల మిశ్రమాన్ని ఉపయోగించవచ్చు. అలాగే మర్రి ఆకుల పేస్ట్‌లో కొద్దిగా చల్లని పాలను కలిపి ఈ మిశ్రమాన్ని రాస్తుంటే మొటిమలు, చర్మంపై ఉండే దురదలు,దద్దుర్లు తగ్గిపోతాయి. ఇలా మర్రి చెట్టు అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. దీని లాభాలను అసలు మరిచిపోకండి.

# కొంచెం శ్రమకే ఆయాసమా?



కొన్ని మెట్లు ఎక్కగానే ఊపిరి సరిగ్గా ఆడటం లేదా? ఆయాసంగా అనిపిస్తున్నదా? ఏ కొంచెం శారీరక శ్రమ చేసినా ఊపిరి సరిపోవడం లేదంటే దాన్ని తేలిగ్గా తీసుకోకూడదు. వయసు పెరగడం, అలసట వల్ల ఇలా జరుగుతుంది. దీన్ని అయిదు ప్రధాన ఆరోగ్య సమస్యలకు హెచ్చరికగా భావించాలి. ఏదైనా అనుమానం అనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. తగిన చికిత్స తీసుకోవాలి. రక్తహీనత: శరీరం తగిన మోతాదులో ఎర్ర రక్త కణాలు లేదా హిమోగ్లోబిన్‌ను ఉత్పత్తి చేయకపోతే రక్తహీనత (ఎనీమియా) వస్తుంది. హిమోగ్లోబిన్ మనం పీల్చిన గాలి నుంచి ఆక్సిజన్ గ్రహించి శరీర అవయవాలకు సరఫరా చేస్తుంది. హిమోగ్లోబిన్ తగ్గితే శరీర కణజాలానికి ఆక్సిజన్ తగినంతగా అందదు. దీంతో శ్వాసించే క్రమం తగ్గిపోతుంది. ముఖ్యంగా శారీరక శ్రమ చేస్తున్నప్పుడు ఇలా జరుగుతుంది. కాబట్టి, చర్మం పచ్చబడటం, బలహీనత, అలసట మొదలైన వాటితో బాధపడుతుం టే అది రక్తహీనత లక్షణం కావచ్చు.

గుండెజబ్బులు: చిన్న ప్రయత్నానికే ఊపిరి సరిగ్గా ఆడటం లేదంటే అది గుండెజబ్బుకు సంకేతం కావచ్చు. వయసు పెరిగేకొద్దీ గుండె రక్తాన్ని పంప్ చేసే శక్తి తగ్గుతూ వస్తుంది. దీంతో ఊపిరితిత్తుల్లో ఫ్లూయిడ్ పేరుకుంటుంది. మెట్లెక్కేటప్పుడు మీకు కండ్లు తిరగడం (డిజినెస్), కాళ్లవాపు, ఛాతినొప్పి లాంటి సమస్యలు వేధిస్తుంటే డాక్టర్‌ను కలవాలి. ఇది గుండె సమస్యలకు సంకేతం అయ్యుంటుంది.

ఊపిరితిత్తుల సమస్యలు: మన శరీరానికి కావాల్సిన ఆక్సిజన్‌ను సరఫరా చేయడమే ఊపిరితిత్తుల పని. శ్వాసించడం కష్టమైపోతున్నదంటే అది ఊపిరితిత్తుల సమస్య కావచ్చు. ఆస్తమా, బ్రాంకైటిస్, ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డీ), క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) లాంటివి ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీస్తాయి. ఫలితంగా ఏ కొంచెం శ్రమపడ్డా శ్వాసలో ఆటంకం (డిస్పనోయియా) కలుగుతుంది. దగ్గు, శ్వాస గుర్‌గుర్‌మని రావడం (వీజింగ్), ఛాతీలో అసౌకర్యంగా అనిపిస్తుంటే జాగ్రత్తగా ఉండాలి.

ఒత్తిడి- ఆందోళన: ఒత్తిడి, ఆందోళన కారణంగా కూడా ఊపిరి సరిగ్గా ఆడదు. అధిక ఒత్తిడి వల్ల శరీరం అడ్రినలిన్ హార్మోన్‌ను ఎక్కువగా విడుదల చేస్తుంది. ఇది శ్వాసించే క్రమాన్ని పెంచుతుంది. దీంతో సరిగ్గా శ్వాస పీల్చుకోవడం లేదనే భ్రమలో పడిపోతారు.

అధిక బరువు వల్ల: అధిక బరువు ఉంటే శరీరం తన సాధారణ విధులను నిర్వర్తించడానికి మరింత ప్రయత్నం చేయాల్సి వస్తుంది. అధిక కొవ్వు వల్ల డయాఫ్రమ్, ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పడుతుంది. ఇది ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. దీంతో ఏ కొంచెం శారీరక శ్రమ చేసినా శ్వాస సరిపోని పరిస్థితి తలెత్తుతుంది.

# ఆహారంలో ఇవి చేర్చుకోండి.. మంచి నిద్రపోండి..





కొంతమందికి రాత్రుళ్లు సరిగ్గా నిద్ర పట్టదు. అనారోగ్య సమస్యలున్న వారు డాక్టరు చెప్పిన పద్ధతులు పాటిస్తారు. అయితే ఆరోగ్యంగా ఉన్న వాళ్లు కూడా ఈ సమస్యతో బాధపడుతుంటారు. అటువంటి వారు ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే మంచి నిద్రని పొందవచ్చు. ఆర్థికంగా భారమైనా వీటిని చేర్చుకుంటే ఫలితం ఉంటుంది. పాలకూరలో మెగ్నీషియంతో పాటు ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు ఒత్తిడిని తగ్గించి మనసును ప్రశాంతం చేయడంలో సహాయపడతాయి. అందుకే రోజూ పాలకూర తినడం మంచి నిద్రకు దారి తీస్తుంది. పాలకూర వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి శరీరం స్థిరంగా ఉంటుంది. బాదం గింజల్లో పోషకాలు చాలా ఉంటాయి. వీటిలో మెగ్నీషియం ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన మినరల్స్ అందుతాయి. రోజూ కొద్దిగా బాదం గింజలు తినడం వల్ల మెదడు కూడా చురుగ్గా మారుతుంది. అంతేకాకుండా ఇందులో ఉన్న ఆరోగ్యకరమైన కొవ్వులు మంచి నిద్రకు సహాయపడతా యి. అందుకే నిద్ర సమస్యలు ఉన్నవారు బాదం తినడం అలవాటు చేసుకోవాలి. అవకాడో పండులో కూడా మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియంతో నిండి ఉంటుంది. అవకాడో తినడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి శరీరంలోని రసాయనాలు సరిగ్గా పనిచేస్తాయి. ఫలితంగా మంచి నిద్ర వచ్చే అవకా శం ఉంటుంది. గుమ్మడి గింజలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. వీటిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కండరాలు రిలాక్స్ అవు తాయి. మానసిక ఒత్తిడి తగ్గి నిద్ర మెరుగుపడుతుంది. గుమ్మడి గింజలు నిద్ర సమస్యలకు ఒక సహజమైన పరిష్కారం. క్వినోవా మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్ అధికంగా కలిగిన ఆహారం. ఇవి తినడం వల్ల శరీరంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మంచి నిద్రకు కూడా సహాయ పడుతుంది. ఇది శరీరశక్తిని పెంచడంలో కూడా మేలు చేస్తుంది. బ్లాక్ బీన్స్‌లో కూడా మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్ మంచి మోతాదులో ఉంటాయి.

ఈ బీన్స్‌ను సలాడ్, సూప్,కూరలలో వేసితినడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి శరీరాన్ని ప్రశాంతంగా ఉంచి నిద్రకు సహాయపడతాయి. అరటి పండులో కూడా మెగ్నీషియం ఉంటుంది. ఇందులో పొటాషియం అధికంగా ఉండటం వల్ల కండరాలను రిలాక్స్ చేసి శరీర ఒత్తిడిని తగ్గిస్తుంది. దాంతో మానసిక ప్రశాంతత కలుగుతుంది. నిద్ర మరింత హాయిగా వస్తుంది.

సాల్మన్ చేపల్లో మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి నిద్ర నాణ్యతను పెంచడంలో సహాయపడతాయి. ఈ చేపలు తినడం వల్ల శరీరం, మనస్సు రెండూ బాగా విశ్రాంతి పొందుతాయి. ఈ విధంగా మెగ్నీషియం ఉన్న ఆహారాలు మంచి నిద్రను అందించి ఆరోగ్యానికి తోడ్పడతాయి.

# లెట్స్ పిల్లో టాక్!



ప్రస్తుతం భార్యాభర్త.. ఇద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితులు. ఓవైపు ఆఫీస్.. ఇంటి పనులంటూ ఉరుకులు పరుగులు. మరోవైపు పిల్లలు, వారి చదువులు. పెద్దవాళ్ల బాధ్యతలు! వెరసి.. క్షణం తీరికలేని జీవితాలు! దంపతులకు కాస్తంత సమయం దొరకడం కూడా గగనమే అవుతున్నది.ఒకవేళ దొరికినా.. ఇద్దరూ ఏకాంతంగా గడపడం కూడా కష్టంగా మారుతున్నది. ఫలితంగా..భార్యాభర్తల మధ్యదూరం పెరుగు తున్నది. ఈ సమస్యకు 'పిల్లో టాక్' ఓ పరిష్కారం చూపుతున్నది.దంపతులు ఎంత సన్నిహితంగా ఉంటే.. వారి మధ్య బంధం అంత బలంగా ఉంటుంది. మనసు విప్పి మాట్లాడుకుంటేనే.. సాన్నిహిత్యం పెరుగుతుంది. కానీ, ఈ ఉరుకుల పరుగుల జీవితంలో చాలామందికి అలాంటి సమయం దొరకడం లేదు. దొరికినా.. కొంతమంది తమ భాగస్వామితో అన్ని విషయాల్నీ స్వేచ్ఛగా చెప్పుకోలేకపోతున్నారట. తమ ఇష్టాయిష్టాలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి పంచుకోవడానికీ ఆసక్తి చూపించడం లేదట. చెబితే భాగస్వామి ఎలా రియాక్ట్ అవుతారో.. తమ ఇష్టాయిష్టాలు, లక్ష్యాలను గౌరవిస్తారో లేదోనన్న సందిగ్ధమే ఇందుకు కారణమని నిపుణులు అంటున్నారు. ఇలాంటి వాళ్లు 'పిల్లో టాక్'తో ఒక్కటవ్వొచ్చని చెబుతున్నారు.

మనసులు దగ్గర..: రాత్రిపూట పడకగదిలో భార్యాభర్తలు ఇద్దరూ ఏకాంతంగా, మనసు విప్పి మాట్లాడుకోవడమే.. పిల్లో టాక్! దీనివల్ల భార్యాభర్తల శరీరాల్లో 'ఆక్సిటోసిన్' అనే ప్రేమ హార్మోన్ విడుదలవు తుంది. ఇది మానసిక సమస్యలను దూరం చేస్తుంది. మనసుకు ప్రశాంతత చేకూరుస్తుంది. దంపతుల మధ్య దూరం తగ్గడంతోపాటు ఒకరినొకరు అర్థం చేసుకునే సమయం చిక్కుతుంది. భాగస్వామి మనసులో కోరికలు తెలుసుకోవడంతో పాటు వాటిని నెరవేర్చడానికీ అవకాశం ఉంటుంది. అందుకే.. భార్యాభర్తలు రోజంతా ఎంత బిజీగా ఉన్నా.. రాత్రిపూట కనీసం ఓ అరగంటైనా మనసు విప్పి, ఏకాంతంగా మాట్లాడుకోవాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ఇవి వద్దే వద్దు..: అయితే, చాలామంది 'పిల్లో టాక్'లో లేనిపోని సమస్యలను ముందేసుకుంటారు.

దొరక్కదొరక్క దొరికిన సమయాన్ని దుర్వినియోగం చేసుకుంటారు. ఎప్పుడో జరిగిన గొడవలు, ఆఫీస్ సమస్యలు, పిల్లల చదువులు,పెద్దల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను చర్చిస్తుంటారు. ఇలాంటి చర్చలవల్ల సరదాగా సాగాల్సిన సమయం.. వృథాగా గడిచిపోతుంది. ఒక్కోసారి పాతగొడవలు ముందుకొచ్చి.. దంపతుల మధ్య దూరం పెరిగే ప్రమాదమూ ఉంటుంది. వాటికి బదులుగా పెళ్లినాటి జ్ఞాపకాలు, హనీమూన్ మధురానుభూతులు, ఇచ్చిపుచ్చుకున్న కానుకలు, ఇద్దరి మధ్య జరిగిన సరదా సంఘటనలు.. ఇలాంటివి గుర్తుకు తెచ్చుకుంటే మంచిది.

## దసరాకు రిలీజ్ చేసేలా.. ఫౌజీ షూటింగ్ స్పీడ్




ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకు లకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనుల ను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయంఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి..దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## అడివి శేష్ కొత్త ప్రాజెక్ట్ ఫిక్స్.. రాహుల్ రవీంద్రన్‌తో క్రేజీ కాంబినేషన్!



టాలీవుడ్ హీరో అడివి శేష్ తన వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు అలరిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. తాజాగా ఆయన నటించిన డెకాయిట్ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందన అందుకుంటోంది. దర్శకుడు షానీల్ డియో తెరకెక్కించిన ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటించగా, ప్రముఖ నటులు అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా అడివి శేష్ తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. నటుడు-దర్శకుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తాను ఓ సినిమా చేయబోతున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించాడు. ఇటీవల రాహుల్ రవీంద్రన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రలో తెరకెక్కించిన ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రం మంచి ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో ఆయన శేష్ కోసం కూడా ఒక బలమైన కథను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.అయితే ఈ క్రేజీ కాంబినేషన్ వెంటనే పట్టాలెక్కే అవకాశాలు లేవు. ప్రస్తుతం అడివి శేష్ తన సూపర్ హిట్ చిత్రం గూఢచారికి సీక్వెల్‌గా వస్తున్న +2 షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ పనులు పూర్తయ్యాకే రాహుల్ రవీంద్రన్ ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అడివిశేష్ సెలెక్టివ్ కథలఎంపిక, రాహుల్ రవీంద్రన్ ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్ కలవడంతో ఈ కొత్త సినిమా ఇప్పటికే సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ కాంబినేషన్ నుంచి మరో విభిన్నమైన సినిమా రావడం ఖాయం అని అభిమానులు భావిస్తు న్నారు. చూద్దాం ఈ ప్రాజెక్ట్ గురించి పూర్తి క్లారిటీ ఎప్పుడు వస్తుందో అనేది. కాగా, భారీ అంచనాలతో థియేటర్స్ లోకి వచ్చిన డెకాయిట్ మూవీఓ మోస్తరు వసూళ్లు రాబడుతున్నట్టు తెలుస్తుంది. ఈ మూవీ లాభాల్లోకి చేరుకుంటుందా లేదా అనే చర్చ జోరుగా నడుస్తుంది.

## 'స్వయంభు' కూడా ఇప్పట్లో వచ్చేలా లేదుగా..

యువ హీరో నిఖిల్ సిద్ధార్థ కెరీర్‌లోనే అత్యంత భారీ వ్యయంతో రూపొందుతున్న పీరియడ్ నేపథ్య చిత్రం 'స్వయంభు.' ఈ మూవీ రిలీజ్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ మూవీ మరోసారి వాయిదా పడనుందని తెలుస్తుంది. ప్రారంభంలో ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేయాలని భావించినప్పటికీ, తరు వాత వేసవి కాలానికి మార్చారు. ఇప్పుడు





మరోసారి విడుదల తేదీ మారే పరిస్థితి ఏర్పడింది.చిత్ర బృందం ఏప్రిల్ 30న రిలీజ్ చేయాలని పరిశీలించినప్పటికీ, సాంకేతిక పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ఆ తేదీ సాధ్యం కాలేదని సమాచారం. ముఖ్యంగా చిత్రంకి సంబంధిం చిన భారీ వీఎఫ్ఎక్స్ పనులకి మరింత సమయం పడుతుందని తెలుస్తుంది. పీరియాడిక్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతిదృశ్యం అత్యున్నత స్థాయిలోఉండేలా చిత్ర బృందంశ్రద్ధ తీసుకుం టోంది. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, ప్రేక్షకులకు అద్భుత అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే విడుదలను వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన విజువల్స్ కథలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే అవి పూర్తి స్థాయిలో మెరుగ్గా రావాలని హీరో నిఖిల్ సిద్ధార్థతో పాటు చిత్ర యూనిట్ పట్టు దలగా ఉంది. తొందరపడి విడుదల చేయడం కంటే, పూర్తి స్థాయి పనులు ముగిసిన తర్వాతే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయిం చుకున్నారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని మే నెల చివరి వారంలో విడుదల చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విడుదల తేదీ ఖరారైన వెంటనే ప్రచార కార్యక్రమాలు కూడా భారీ స్థాయిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.




## అల్లు అర్జున్ ఫ్యూచర్ లైనప్ ఫుల్ బిజీ..
## ప్రశాంత్ నీల్ సినిమా ఎప్పుడు?





ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యూచర్ ప్రాజెక్ట్స్ ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. 'రాకా' సినిమా తర్వాత ఆయన ఎవరితో పని చేయబోతున్నారు? అన్న ప్రశ్నపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న రాకా పూర్తయ్యిన వెంటనే అల్లు అర్జున్ తన డ్రీమ్ లైనప్‌ను అమలు చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లైనప్‌లో స్టార్ డైరెక్టర్లు ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగా ఉండటం విశేషం. అయితే అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బన్నీ-ప్రశాంత్ నీల్ కాంబినేషన్ మాత్రం వెంటనే ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దానికి ప్రధాన కారణం ప్రశాంత్ నీల్ ప్రస్తుతం యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ సినిమాతో బిజీగా ఉండడం . ఈ భారీ ప్రాజెక్ట్ రెండు భాగాలుగా రూపొందనుందని సమాచారం. నీల్ తన స్టైల్ ప్రకారం ఈ రెండు భాగాలను పూర్తి చేసిన తర్వాతే కొత్త ప్రాజెక్ట్‌ను చేపట్టే అవకాశం ఉంది. అందువల్ల అల్లు అర్జున్‌తో ఆయన సినిమా ప్రారంభం కొంత ఆలస్యం కావచ్చు. మరోవైపు అల్లు అర్జున్ షెడ్యూల్ కూడా బిజీగానే ఉంది. ప్రస్తుతం 'రాకా'పై దృష్టి పెట్టిన ఆయన, ఆ తర్వాత వెంటనే దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో చేయనున్న #AA23 ప్రాజెక్ట్‌లో పాల్గొనాల్సి ఉంది. ఈ సినిమా కూడా భారీ అంచనాల మధ్య రూపొందనుంది. అలానే త్రివిక్రమ్ దర్శకత్వంలో కూడా బన్నీ ఓ మూవీ చేయనున్నట్టు సమాచారం. ఇలా ఇద్దరు స్టార్స్ తమ తమ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటంతో బన్నీ-ప్రశాంత్ నీల్ కాంబినేషన్ కోసం అభిమానులు మరికొంతకాలం వేచి చూడాల్సి వస్తోంది. అయితే ఈ కాంబినేషన్ ఎప్పుడు సెట్స్ పైకి వెళ్లినా, అది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక భారీ యాక్షన్ డ్రామాగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక ఇదిలా ఉంటే బన్నీ చేస్తున్న రాకా ప్రాజెక్ట్ బాక్సాఫీస్‌ని షేక్ చేయడమే కాకుండా అనేక రికార్డులు సెట్ చేస్తుందని అంటున్నారు.

## 'ఐరెన్ లెగ్' ముద్ర బాధాకరం



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ కృతి శెట్టి తన కెరీర్‌లో ఎదుర్కొంటున్న విమర్శలపైతాజాగా స్పందించారు. నటిగా ప్రతి సినిమాలోనూ తాను వంద శాతం శ్రమిస్తానని, పాత్రకు న్యాయం చేయడానికి ఎలాంటి రాజీ పడనని చెప్పారు. అయితే సినిమా ఫలితంమాత్రం పూర్తిగాతన చేతిలో ఉండదని, అలాంటి పరిస్థితు ల్లో 'ఐరెన్ లెగ్' అనిముద్ర వేయడం తనను తీవ్రంగా బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా హిట్ అవుతుందా, ఫ్లాప్ అవు తుందా అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని, కేవలం తనను లక్ష్యంగా చేసుకుని విమర్శిం చడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. కొన్నిసార్లు కేవలం అదృష్టం లేకపోవడం వల్ల అవకా శాలు కోల్పోవడం ఒక నటిగా తనను కృంగదీస్తోందని తెలిపారు. ప్రస్తుతం తాను నటిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రంపై కూడా కొన్నిసందేహాలు వ్యక్తమవుతున్నాయని, అవి తనను కలచివేస్తున్నాయని కృతి వెల్లడిం చారు. అయినప్పటికీ తన కృషిని మాత్రం ఎప్పటికీ ఆపబోనని, మంచి కథలతో ప్రేక్షకులను అలరించడానికి ప్రయత్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. ఈ చిత్రంలో తాను 'ధీమా' అనే పాత్రలో కనిపించనున్నట్లు కృతి చెప్పారు. సోషల్ మీడియాకు బానిసైన, 'నోమోఫోబియా'తో బాధపడే యువతిగా నటించడం తనకు కొత్త అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. కథ 2040 నేపథ్యంతో సాగుతున్నప్పటికీ, ప్రస్తుత సమాజానికి బాగా కనెక్ట్ అవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. సినిమా షూటింగ్ సమయంలో ప్రముఖ నటి నయనతారతో తనకు మంచి అనుబంధం ఏర్పడిందని కృతి తెలిపారు. ఒక సందర్భంలో

తనకు సమస్య ఎదురైనప్పుడు నయనతార స్వయంగా ఫోన్ చేసి గైడ్ చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు.ఇక సోషల్ మీడియాలో వచ్చే నెగటివ్ ట్రోల్స్‌పై కూడా కృతి స్పందించారు. విమర్శలు చేసే వారు తమ ఆలోచనా ధోరణి మార్చుకోవాలని, పాజిటివ్‌గా ఆలోచించడం చాలా ముఖ్యం అని సూచించారు. తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ, తాను పాతకాలపు ప్రేమకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి నటనపైనే ఉందని, మరో ఐదు నుంచి పది సంవత్సరాల తర్వాత డేటింగ్ చేసి పెళ్లి గురించి ఆలోచిస్తానని వెల్లడించారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com